RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

## నిపుణులను స్వదేశానికి రప్పిద్దాం

### నిపుణులను ఆకర్షించేందుకు కేంద్రం ప్లాన్

న్యూఢిల్లీ : ఉన్నత విద్యపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న విధానాలతో పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఈ నేపథ్యంలో అమెరికా సహా విదేశాల్లో స్థిరపడిన భారతీయ, భారత సంతతి పరిశోధకులు, విద్యా నిపుణులను స్వదేశానికి రప్పించి.. వారిని ఇక్కడి విద్యా సంస్థల్లో బోధించేలా, పరిశోధనలు చేసేలా కేం ద్రం చర్యలు తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. దేశ పరిశో ధన, సృజనాత్మక రంగాలను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. గతంలో ఇలాంటి ప్రణాళికను పరిశీలించినప్పటికీ.. విధానపరమైన జాప్యం, అనిశ్చిత పరిస్థితులు వంటి అనేక అడ్డంకులు ఎదురయ్యాయి. అయితే అమెరికాలో ఇటీవలి పరిణామాల నేపథ్యంలో మోదీ సర్కారు.. ఈ ప్రణాళికను కొత్తగా పరిశీలిస్తోంది. పరిశోధనలు లేదా బోధన కోసం నిర్దిష్ట కాలంపాటు భారత్‌లో గడిపేందుకు సిద్ధంగా ఉన్న వారిని తిరిగి తీసుకురావడం కోసం విద్య, శాస్త్ర సాంకేతిక శాఖలతో సంప్రదించి ఒక పథకాన్ని రూపొందిస్తున్నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 269 శుక్రవారం 24 అక్టోబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00




హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పర్వంలో స్క్రూట్నీ పూర్తయింది. 211 మంది అభ్యర్థులు 321 నామినేషన్లు దాఖలు చేశారు. 17 గంటల పాటు స్క్రూట్నీ నిర్వహించగా..130 మంది అభ్యర్థులు వేసిన 186 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. స్క్రూట్నీ అనంతరం 81 మంది వేసిన 135 నామినేషన్లు ఆమోదించినట్టు రిటర్నింగ్ అధికారి తెలిపారు. అక్టోబర్ 23న ఎవరూ నామినేషన్ విత్ డ్రా చేసుకోలేదు. ఇదిలా ఉండగా అక్టోబర్ 24 వరకు విత్ డ్రాలకు అవకాశం ఉంది. రేపు సాయంత్రం 3 గంటల తర్వాత బరిలో ఎంత మంది నిలుస్తారో వారికి గుర్తులు కేటాయించనున్నారు అధికారులు. బీఆర్ఎస్ నుంచి మాగంటి సునీత్, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ నామినేషన్లు ఆమోదించారు

అధికారులు. నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్ 24 వరకు సమయం ఉన్నందును తుది బరిలో ఎంత మంది నిలుస్తారనేది తేలనుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది. సిట్టింగ్ సీటు దక్కించుకోవాలని బీఆర్ఎస్, జూబ్లీహిల్స్ లో గెలవాలని అధికార పార్టీ, సత్తా చాటాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు పోలింగ్ .. 14న కౌంటింగ్ జరగనుంది.

# ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేత!




## ఆశావహులకు గుడ్‌న్యూస్!

హైదరాబాద్ : తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. స్థానిక ఎన్నికల్లో పోటీచేసేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేసేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్ అధ్యక్షతన జరుగుతోన్న కెబినెట్ ..తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018లోని సెక్షన్ 21(3)ని తొలగించాలని కేబినెట్ నిర్ణయించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండాలన్న నిబంధనను ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్? జారీ చేయనుంది. ఈ మేరకు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018 లోని సెక్షన్ 21(3) ని సవరించేందుకు ఇటీవల కేబినెట్? నిర్ణయించింది. ఈ ఫైల్ పై పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి సీతక్క, సీఎం రేవంత్ ఇప్పటికే సంతకం చేశారు. ఇవాళ కేబినెట్ ఆమోదించడంతో ఆ ఫైల్ ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పంపనున్నారు. గవర్నర్ సంతకం తర్వాత ఆర్డినెన్స్ జారీచేయనున్నారు. 1994లో అప్పటి ప్రభుత్వం కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించడంలో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం 1994 తర్వాత మూడో సంతానం కలిగితే వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి అనర్హులు. ఏపీ నుంచి తెలంగాణ విడిపోయాక 2018లో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టాన్ని రూపొందించిన కేసీఆర్ ప్రభుత్వం.. ఇద్దరు పిల్లల నిబంధనను టచ్ చేయలేదు. పంచాయతీరాజ్ చట్టం 2018 సెక్షన్ 21(3) ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలున్న వారు అనర్హులు. అయితే.. ప్రస్తుతం కుటుంబ నియంత్రణపై అవగాహన పెరిగినందున పాత నిబంధనను మార్చి ఇద్దరి కంటే ఎక్కువ సంతానం ఉన్న వారికి సైతం పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పలు రాజకీయ పార్టీలు కోరాయి.

2024 డిసెంబర్ 20న జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఈ ప్రతిపాదన రాగా మంత్రి వర్గం ఆమోదించ లేదు. తాజాగా ఇవాళ జరిగిన కేబినెట్..పంచాయతీ ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధనను ఎత్తివేతకు ఆమోదం తెలిపింది.

# నేటి నుంచి పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ



హైదరాబాద్ : తెలంగాణ ప్రస్తుత రాజకీయాల్లో కీలక అంశంగా మారిన ఫిరాయింపుల వ్యవహారం తుది దశకు చేరుతోంది. పార్టీ ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ (భారత రాష్ట్ర సమితి) ఎమ్మెల్యేల అనర్హతపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎల్లుండి నుంచి చివరి దశ విచారణలు చేయబోతున్నారు. ఈనెల 24 వ తేదీ నుంచి ప్రారంభమయ్యే విచారణల సమయంలో అసెంబ్లీ పరిసరాల్లో ఆంక్షలు అమలు చేస్తున్నారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేల క్రాస్-ఎగ్జామినేషన్ పూర్తయిన నేపథ్యంలో, మిగిలిన కేసులు ఈ వారంలో ముగియనున్నాయి. భారత రాజ్యాంగ పదో అనుసూచి (ఫిరాయింపు నిరోధక చట్టం) ప్రకారం స్పీకర్ విచారణలు చేస్తున్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారంటూ ఫిరాయింపు ఆరోపణలు మొదలయ్యాయి. ఈ విషయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల సంజయ్, చింతా ప్రభాకర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు స్పీకర్‌కు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 29, 2025 నుంచి విచారణలు ప్రారంభమై, అక్టోబర్ 1 వరకు మొదటి దశ పూర్తయింది. ఇప్పటికే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పఠాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి వంటి నలుగురు ఎమ్మెల్యేల క్రాస్-ఎగ్జామినేషన్ ముగిసింది. ఈ ఎమ్మెల్యేలు తమ తరపు న్యాయవాదులతో సహా స్పీకర్ ముందు హాజరై, తాము బీఆర్ఎస్‌లోనే ఉన్నామని, ఫిరాయింపు జరగలేదని తమ వాదనలు వినిపించారు. అయితే, పిటిషనర్లైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాటికి సంబంధించిన ఆధారాలు, అఫిడవిట్లు, వీడియోలు సమర్పించారు. ఇక, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈనెల 24వ తేదీ నుంచి మిగిలిన నాలుగు కేసులపై మౌఖిక వాదనలు వినాలని నిర్ణయించారు. ప్రతి కేసులో ఇరు వర్గాలు (పిటిషనర్లు, ప్రతివాదులు) తమ వాదనలు వినిపిస్తారు. ఈనెల 24న ఉదయం 11 గంటలకు కల్వకుంట్ల సంజయ్ వర్సెస్ టి ప్రకాష్ గౌడ్ కేసు విచారణ. మధ్యాహ్నం 12 గంటలకు చింతా ప్రభాకర్ వర్సెస్ కాలే యాదయ్య కేసు విచారణ. మధ్యాహ్నం రెండు గంటలకు చింతా ప్రభాకర్ వర్సెస్ గూడెం మహిపాల్ రెడ్డి కేసు విచారణ. మధ్యాహ్నం మూడు గంటలకు పల్లా రాజేశ్వర్ రెడ్డి వర్సెస్ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కేసు విచారణ. ఎమ్మెల్యేల విచారణ నేపథ్యంలో ఈనెల 24 నుంచి 31 వరకు అసెంబ్లీ పరిసరాల్లో ఆంక్షలు.




యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామిని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇవాళ దర్శించుకున్నారు. కవితకి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ క్రమంలో ఆలయంలో కవిత ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మీడియాతో కవిత మాట్లాడారు. రాజకీయ పార్టీ ఏర్పాటుపై ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు కోరుకుంటే తప్పకుండా తాను రాజకీయ పార్టీ పెడతానని స్పష్టం చేశారు. పార్టీ పెడితే తనకు కాదని.. ప్రజలకు మేలు జరగాలని ఉద్ఘాటించారు కవిత. తెలంగాణ జాగృతి.. సివిల్ సొసైటీ సంస్థ అయినప్పటికీ అవసరమైతే రాజకీయాల గురించి తాను పుష్కలంగా మాట్లాడతానని చెప్పుకొచ్చారు. రాజకీయాల గురించి తెలంగాణ జాగృతి తరపున మాట్లాడాలంటే రాజకీయ పార్టీగానే ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పార్టీ రావాలని ప్రజలు కోరుకుంటే తప్పకుండా వస్తానని... అందులో ఇబ్బందేమీ లేదని పేర్కొన్నారు. ఏపీలో మూడు, తమిళనాడులో రెండు ప్రాంతీయ పార్టీలు ఉన్నాయని తెలిపారు. కేరళలో గల్లీకి ఒక పార్టీ ఉందని గుర్తుచేశారు. పార్టీలు ఉండటం పెద్ద విషయం కాదని... ఆయా పార్టీలతో ప్రజలకు మేలు జరగాలని సూచించారు కవిత. తాను చేపడుతున్న కార్యక్రమాలపై ప్రజాభిప్రాయం తెలుసుకోవటానికే 'జనం బాట' కార్యక్రమం నిర్వహిస్తున్నానని తెలిపారు. ఎల్లుండి నుంచి 4నెలల పాటు 'జనం బాట' కార్యక్రమం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో అన్ని వర్గాలను కలిసి వారి సమస్యలు తెలుసుకుంటానని వెల్లడించారు. 'జనం బాట' కార్యక్రమానికి లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సుల కోసమే తాను ఇక్కడకి వచ్చానని చెప్పుకొచ్చారు. మొన్న తిరుపతి, ఇప్పుడు యాదాద్రి దేవాలయాలను దర్శించుకున్నానని తెలిపారు. ప్రజా సమస్యలను అర్థం చేసుకునే శక్తి దేవుడు తనకు ఇవ్వాలనే దైవ దర్శనం చేసుకుంటున్నానని వివరించారు కవిత. ఈ నెల 25వ తేదీన తమ సొంతూరు నిజామాబాద్ నుంచి 'జనం బాట' కార్యక్రమం ప్రారంభిస్తున్నానని తెలిపారు.

# భారత సైన్యంలోకి 'భైరవులు'

## ఆ 'భైరవుల'తో మామూలుగా ఉండదు..!



## ఇకపై వారి ఆటలు సాగవు....

ఇండియన్ ఆర్మీ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటూనే ఉంది. ఇందులో భాగంగానే తాజాగా భైరవ్ బటాలియన్ల పేరుతో భారత ఆర్మీలోకి కొత్త శక్తి ఎంటర్ అవుతోంది. **ఇంతకీ ఏంటీ భైరవ్ బటాలియన్లు అనేగా..** భైరవ్ బటాలియన్లు అనేవి సైన్యంలో కొత్తగా ఏర్పాటైన తేలికపాటి కమాండో బలగాలు. ఒక్క యూనిట్‌లో సుమారు 250 మంది సైనికులు ఉంటారు. ఇవి సాధారణ ఇన్ఫంట్రీ కంటే చిన్నవి, కానీ స్పెషల్ ఫోర్స్‌ల కంటే కొంచెం పెద్దవి. వేగంగా స్పందించటం, ఆకస్మిక దాడులు చేయటం, టెక్నాలజీని ఉపయోగించి శత్రువును అణచివేయటం ఈ బలగాల లక్ష్యంగా చెప్పొచ్చు. భారత సైన్యం ఇప్పటికే 5 భైరవ్ బటాలియన్లను శిక్షణలోకి తీసుకువచ్చింది. ఇంకా 20 బటాలియన్లు వచ్చే ఆరు నెలల్లో సిద్ధం అవుతాయి. మొదటి బ్యాచ్ శిక్షణ అక్టోబర్ 1న ప్రారంభమై అక్టోబర్ 30తో పూర్తవుతుంది.

తర్వాత అవి పూర్తిస్థాయిలో పనిచేయడం మొదలు పెడతాయి. ఈ బలగాలు కొత్త రకం తేలికపాటి ఆయుధాలు, డ్రోన్లు, సర్వేలెన్స్ పరికరాలతో సిద్ధంగా ఉంటాయి. వీటివల్ల క్లిష్టమైన పర్వతాలు, అడవులు, సరిహద్దు ప్రాంతాల్లో కూడా వీరు స్వతంత్రంగా పనిచేయగలరు. అలాగే వీరికి గగనతల రక్షణ కోసం యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ మిసైళ్లు, ఖచ్చితమైన లక్ష్యాలను చేదించగల ఆర్టిలరీ సపోర్ట్ కూడా ఉంటుంది. ప్రతి యూనిట్‌లో 7-8 మంది అధికారులు, 250 మంది సైనికులు ఉంటారు. మొదట 2-3 నెలలు రీజిమెంటల్ సెంటర్లలో శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత స్పెషల్ ఫోర్స్‌లతో కలిసి ఒక నెల అధిక శిక్షణ ఇస్తారు. శత్రు కదలికల గమనిక, ఆకస్మిక దాడులు, సరిహద్దు ప్రాంతాల్లో భద్రత, తక్షణ స్పందన అవసరమైన పరిస్థితుల్లో సహాయం చేయటం వంటి వీరి శిక్షణలో ఉంటాయి. ఈ భైరవ్ బటాలియన్లు సాధారణ ఇన్ఫంట్రీ బలగాలు, స్పెషల్ ఫోర్స్‌ల మధ్య ఉన్న ఖాళీని భర్తీ చేస్తాయి. వీటివల్ల సరిహద్దుల్లో చైనా, పాకిస్తాన్ దిశగా త్వరగా ప్రతిస్పందించగల సామర్థ్యం పెరుగుతుంది.

సైన్యంలో జరుగుతున్న "డెకేడ్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్మేషన్" (దశాబ్ద మార్పు) ప్రణాళికలో భాగంగా వీటిని రూపొందించారు.

ఇవే కాకుండా "రుద్రా బ్రిగేడ్", "శక్తిబాణ్", "దివ్యాస్త్ర" వంటి కొత్త యూనిట్లు కూడా సైన్యంలో తయారవుతున్నాయి.

# సంపాదకీయం

## భారత్ విషయంలో మారిన ట్రంప్ స్వరం..

## జాతకం చెబుతున్నారా?

జరిగింది చెబుతాము, జరబోయేది చెబుతాము అన్నట్లుగా భారత్ తీసుకునే నిర్ణయాలు, చేసే పనుల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జాతకాలు చెప్పినట్లుగా మాట్లాడుతున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు విషయంలో ఇప్పటికే చాలా సార్లు మాట్లాడిన ట్రంప్.. ఈ సారి మాత్రం స్వరం కాస్త మార్చారు.. ఫ్యూచర్ టెన్స్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా మోడీపై ప్రశంసలు కురిపించారు. అవును... అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ ను ఉద్దేశిస్తూ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీని ప్రస్తావిస్తూ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో రష్యా చమురు కొనుగోళ్ల విషయంపై స్పందిస్తూ... ఆ దేశ చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ గతంలో ప్రకటించిన ఆయన... తాజాగా భారత్ పెద్ద మొత్తంలో చమురు కొనబోదంటూ వ్యాఖ్యానించారు. మొన్నటివరకు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేసిందంటూ స్వయంగా ప్రకటించేసిన ట్రంప్.. తాజాగా మాట్లాడుతూ.. రష్యా నుంచి భారత్ భారీగా చమురు కొనబోదని వ్యాఖ్యానించారు. అందుకు కారణం... తనలాగానే మోడీ కూడా ఉక్రెయిన్ – రష్యాల మధ్య యుద్ధం ముగియాలని కోరుకుంటున్నారని ట్రంప్ అన్నారు. అయితే.. దీనిపై భారత్ ఏమాత్రం స్పందించలేదు!

**వైట్ హౌస్ లో దీపావళి!:** స్థానిక కాలమానం ప్రకారం.. వైట్ హౌస్ లో దీపావళి వేడుకలు నిర్వహించారు. ఇందులో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తో సహా కీలక అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ – అమెరికన్లకు ట్రంప్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. తనకు భారతీయులంటే చాలా ఇష్టమని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోడీపై ప్రశంసలు కురిపించారు. ఇందులో భాగంగా... ఆయన గొప్ప వ్యక్తి అని, గొప్ప స్నేహితుడని కొనియాడారు. మోడీతో తాను ఫోన్ లో మాట్లాడినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తమ మధ్య గొప్ప సంభాషణ జరిగిందని.. అనేక విషయాల గురించి తాము మాట్లాడుకున్నామని.. ప్రధానంగా వాణిజ్యం గురించి చాలాసేపు చర్చించామని.. ఆయనకు దానిపై చాలా ఆసక్తి ఉందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే.. ట్రంప్, మోడీల ఫోన్ సంభాషణ గురించి భారత్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

**భారత్ – అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం!:** భారత్ – అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం అతిత్వరలో ఖరారయ్యే సంకేతాలు కన్పిస్తున్నాయని జాతీయ మీడియాలో కథనాలొస్తున్నాయి. ఈ ఒప్పందంతో భారత్ పై ట్రంప్ టారిఫ్ లు భారీగా దిగి రానున్నట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. ఈ క్రమంలో.. ప్రస్తుతం 50శాతం ఉన్న టారిఫ్ లు.. 15–16 శాతానికి తగ్గే అవకాశం ఉందని అంటున్నారు. మరోవైపు కేంద్ర ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్ కూడా వాణిజ్య ఒప్పందం ఖరారుపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందానికి సంబంధించి తన వద్ద ఎలాంటి ఇన్ సైడర్ సమాచారం లేదు కానీ... రాబోయే రెండు నెలలు లేదా అంతకంటే ముందే ఇరు దేశాలు సమస్యలను పరిష్కరించుకుని ఒప్పందంపై ఏకాభిప్రాయానికి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నట్లు తెలిపారు.

# పైపైకి గంగ.. తీరనున్న బెంగ



తాండూరు: జిల్లాలో భారీగా కురిసిన వర్షాలతో భూగర్భజల మట్టాలు గణనీయంగా పెరుగుతున్నాయి. గతేడాది ఆగస్టులో ఎక్కువ లోతులో ఉన్న గంగ ఈసారి అదే నెల నాటికి ఏకంగా 4.05 మీటర్లు పైకి వచ్చింది. దీంతో తాగు, సాగునీటికి కష్టాలు తప్పనున్నాయి. ఎగువన కురిసిన భారీ వర్షాలకు దిగువనున్న వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆ నీరంతా చెరువులు, కుంటలు, జలాశయాల్లోకి వెళ్లడంతో మత్తడి దూకాయి. బంజరు, అటవీ భూములు బాగా తడిశాయి.

యాసంగి సాగుకు అనుకూలం.. పెరిగిన భూగర్భ జలమట్టాలు అక్టోబరు నుంచి ప్రారంభమయ్యే యాసంగి సాగుకు అనుకూలంగా మారాయి. 1.30 లక్షల ఎకరాల్లో వరి, వేరుసెనగ, పండ్లతోటలు, కూరగాయల పంటలు సాగు చేయనున్నారు. ఆయా పంటలకు బోర్లు, బావుల నుంచి తోడే నీరే ఆధారం. ఇందులో వరి సాగుకు నీటి వినియోగం ఎక్కువ. మిగిలిన వాటికి వారం, పది రోజులకోసారి పారించాల్సి ఉంటుంది. బోర్లు, బావుల్లో మట్టం పెరగడంతో సాగుకు ఇబ్బందులు తప్పనున్నాయి.

**కాగ్నా, కాకరవేణి పరివాహకంలో..**


జిల్లాలోని కాగ్నా, కాకరవేణి నదులకు అడ్డంగా పది ఆనకట్టలున్నాయి. ఇప్పటికే అవన్నీ వరద నీటితో నిండాయి. ఫలితంగా పరివాహకంలోని బోర్లు, బావుల్లో నీరు 2– 4 మీటర్లపైకి వచ్చింది. ఒక్కో ఆనకట్ట పరిధిలో అదనంగా 300– 500 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేసే వీలు కలిగింది.

**పొదుపుగా వాడుకోవాలి..**

– రవిశంకర్, జిల్లా భూగర్భజల వనరుల అధికారి, వికారాబాద్

జిల్లాలో భారీగా కురిసిన వర్షాలకు భూగర్భ జలమట్టం గణనీయంగా పెరిగింది. పొదుపుగా వాడుకోవాలి. వృథా నీటిని భూమిలోకి ఇంకించేందుకు ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి. రైతులు పంటల సాగుకు ఎంత అవసరమో అంతే వినియోగించాలి. బోర్లను నిర్విరామంగా నడపరాదు. వ్యక్తిగత అవసరాలకు సరిపోను మాత్రమే వాడుకోవాలి.

# అక్రమాల దారి.. ఆదాయం హరీ



సిరిసిల్ల: జిల్లాలో ఇసుక అక్రమ రవాణాతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. జిల్లాకు డీఎంఎఫ్‌టీ(డిస్ట్రిక్ మినరల్ ఫండ్ ట్రస్ట్)కు నిధులు సమకూర్చేందుకు 'సాండ్ ట్యాక్స్' విధానానికి రెవెన్యూ శాఖ చేసిన ప్రణాళికలు కార్యరూపం దాల్చకపోవటంతో ఇసుక అక్రమార్కులు యథేచ్ఛగా సహజ సంపద దోచేస్తున్నారు. మండలాల వారీగా తహసీల్దార్ కార్యాలయాల్లో ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు, రూ.10వేలు చెల్లించి 'సాండ్ ట్యాక్స్' పథకంలో చేరాలని మే, జూన్ నెలల్లో అవకాశం ఇచ్చారు. ఎవరూ ముందుకు రాకపోవటంతో పథకం ఉద్దేశం కాగితాలకే పరిమితమైంది. సాండ్ ట్యాక్స్ ఆన్‌లైన్ విధానం అమలు చేస్తే అక్రమాలకు అడ్డుకట్టపడే అవకాశం ఉంది. ఏటా రూ.6.34 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా. ఉన్నతాధికారులతో కూడిన జిల్లా సాండ్ కమిటీ ఉంది. దీని నిర్వహణకు కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఇద్దరు నోడల్ అధికారులు ఉన్నారు.

**12 చోట్ల రీచ్‌లు**

మానేరు, మూల వాగుల్లో 12 చోట్ల ఇసుక రీచ్‌లను గనుల శాఖ ఇది వరకే గుర్తించింది. 14 లక్షల క్యూబిక్ మీటర్ల పైనే ఇసుక లభిస్తుందని అంచనా వేశారు. ప్రభుత్వ, ప్రైవేటు అవసరాలకు రెవెన్యూ అధికారులు జారీ చేసే వే బిల్లులతోనే ఇసుక తవ్వి.. తరలించాలనే నిబంధన ఉంది. అయితే మండల రెవెన్యూ కార్యాలయాల్లో వే బిల్లుల జారీ, వాటి నిర్వహణ, ఇసుక తవ్వకాలపై పర్యవేక్షణ లేక ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పక్కదారి పడుతోంది. ప్రస్తుతం వే బిల్లులో ట్రాక్టర్ ఇసుక(మూడు క్యూబిక్ మీటర్లకు) రూ.450 చెల్లిస్తున్నారు.

**అధిక ధరలకు విక్రయం**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పంచాయతీ కార్యదర్శులే వే బిల్లులు జారీ చేస్తున్నారు. వీటితో వారు ఇసుక సరఫరా చేసే మధ్యవర్తులను ఆశ్రయిస్తున్నారు. సాధారణంగా జిల్లాలో దూరాన్ని బట్టి రూ.2500 నుంచి రూ.3000 తీసుకుంటున్నారు. అదే ఇందిరమ్మ వేబిల్లులకు వచ్చేసరికి రూ.4000 నుంచి రూ.5000 వసూలు చేస్తున్నారు. అక్రమార్కులు ఒక్క వేబిల్లుతో నాలుగు, అయిదు ట్రిప్పుల ఇసుక వాగుల్లోంచి తోడుకొచ్చి గ్రామ శివారుల్లో పెద్దఎత్తున నిల్వచేసుకుంటున్నారు. వాగుల్లో వరద ఉద్ధృతి ఎక్కువగా ఉన్న సమయంలో దీన్ని అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పంచాయతీల్లో వేబిల్లు జారీ తర్వాత క్వారీలు, రవాణాల తనిఖీలు ఉండవు. బిల్లుపై ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్న చోటు.. తేదీ, సమయం లాంటివి ఏవీ ఉండవు. ఈనెల 18న వీర్నపల్లిలో తప్పుడు తేదీతో ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలో ఈ ఏడాది అక్రమ ఇసుక రవాణా చేస్తున్న 126 వాహనాలు, 156 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి కళ్లు గప్పి తరలిస్తున్నవి అనేకం ఉంటాయి.

# నాడు వెలవెల.. నేడు జలకళ!

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ శివారులోని జక్కుల చెరువు ఇది. దీని కింద రాచర్ల బొప్పాపూర్, రాచర్ల గొల్లపల్లి గ్రామాల్లో 494 ఎకరాల ఆయకట్టు ఉంది. గత జులై వరకు కొత్తగా వరదనీరు వచ్చి చేరకపోవడంతో డెడ్ స్టోరేజీకి చేరుకుంది. ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరదలతో ఓ వైపు ఎగువమానేరు వాగు ఉద్ధృతంగా పారినప్పటికీ చెరువు వెలవెలబోతూ కనిపించడంతో రెండు గ్రామాల రైతులు ఒక దశలో ఆందోళన చెందారు. కొన్ని బోరుబావులు వట్టిపోయాయి కూడా. ఈ వానాకాలం, రానున్న యాసంగి సీజన్‌లో పంటల సాగుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఇదే చెరువు ఇప్పుడు మత్తడి పారుతోంది. ఆ నీరు ఎల్లారెడ్డిపేటలోని 600 ఎకరాల ఆయకట్టు ఉన్న గిద్దెచెరువులోకి ప్రవహిస్తోంది. మరికొద్దిరోజుల్లో గిద్దెచెరువు కూడా మత్తడిపారే అవకాశాలున్నాయి. ఇలా గొలుసుకట్టు చెరువులు క్రమంగా జీవం పోసుకుంటున్నాయి.మెట్ట ప్రాంతమైన జిల్లాలో సీజన్ ఆరంభంలో వర్షాలు తొలుత ఊరించినా ఆ తర్వాత ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో ఒక్కసారిగా ఊపందుకున్నాయి. దీంతో జిల్లాలో నీరు లేక నాడు వెలవెల బోయిన సాగునీటి వనరులు నేడు జలకళను సంతరించుకొని నిండుకుండలను తలపిస్తున్నాయి. అధిక వర్షాలు కురవడంతోపాటు ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదనీరు రావడంతో మధ్యతరహా ప్రాజెక్టులు సహా పలు చెరువులు, కుంటలు మత్తడి పారుతున్నాయి. ముఖ్యంగా గ్రామాల్లో వ్యవసాయానికి ఆయువుపట్టుగా ఉండే గొలుసుకట్టు చెరువులు జీవం పోసుకుంటున్నాయి. మరికొద్ది రోజులపాటు వర్షాలు, వరదలు ఇలాగే కొనసాగితే జిల్లా వ్యాప్తంగా సాగునీటి వనరులన్నీ పూర్తిస్థాయిలో నీటి మట్టాన్ని సంతరించుకొని, కళకళలాడనున్నాయి. ప్రస్తుత వానాకాలం సీజన్‌తోపాటు ముమ్ముందు యాసంగిలోనూ సాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పంటలు పుష్కలంగా పండనున్నాయి.

12 శాతం అదనపు వర్షపాతం



జిల్లాలో ఈ నెల 23 నాటికి 688.6 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా 771.9 మీటర్లు కురిసింది. 12 శాతం అదనపు వర్షపాతం నమోదైంది.

ఇల్లంతకుంట, ముస్తాబాద్, గంభీరావుపేట మండలాల్లో అధిక వర్షాలు పడగా రుద్రంగిలో మాత్రం లోటు వర్షాలు కురిశాయి. మిగతా 9 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.

సిరిసిల్ల డివిజన్‌లో 265, వేములవాడ డివిజన్‌లో 251 కలుపుకొని మొత్తం 516 చెరువులున్నాయి. వీటిలో ఈ నెల 23 వరకు 88 చెరువులు మత్తడి పారుతున్నాయి.

0–25 శాతం నీటితో 126, 25–50 శాతంతో 119, 50–75 శాతంతో 129 చెరువులుండగా 75– 100 శాతం నీరు వచ్చిన చెరువులు 54 ఉన్నాయి.

మరోవైపు భారీ వర్షాలున్నట్లు వాతావరణశాఖ చెబుతోంది. ఈ అంచనా ప్రకారం 75– 100 శాతం వరకు నీరున్న చెరువులన్నీ పూర్తిస్థాయిలో నిండిపోనున్నాయి. మిగతా చెరువులు కూడా జలకళను సంతరించుకొని జిల్లాలో సాగునీటి బెంగ తీరనుంది.

# ఆగండి.. వివరాలు చూడండి!

కాగజ్‌నగర్ : పట్టణంలోని ఓ సూపర్ మార్కెట్‌లో అయిదు రోజుల కిందట ఇద్దరు వ్యక్తులు అయిదు మిల్క్‌మిస్ట్ (శీతలపానీయం)లను కొనుగోలు చేశారు. గడువు దాటినప్పటికీ (ఎక్స్‌పైరీ) విక్రయాలు చేపడుతుండటాన్ని గుర్తించిన వారు.. నిర్వాహకులను ప్రశ్నించారు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో మున్సిపల్, ఆహార భద్రత అధికారులకు ఫిర్యాదు చేశారు.

ఈ విషయమై బాసర జోనల్ అధికారి నాయక్‌ను సంప్రదించగా.. వినియోగదారులు మోసపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కాగజ్‌నగర్‌లో జరిగిన మోసంపై ఫిర్యాదు అందిందని, అధికారిని పంపించి చర్యలు చేపడతామని చెప్పారు. ఆదిలాబాద్ జిల్లాకు వారం రోజుల్లో అధికారి నియామకం కానున్నారని తెలిపారు.

బతుకమ్మ, దసరా పండగల సీజన్ ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులో మార్పులు చేసి కొంతమేర భారం తగ్గించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ వ్యాపారాలు జోరందుకున్నాయి. మార్కెట్‌లో వివిధ ఆఫర్లతో ప్రజలను ఊరిస్తున్నాయి. దుస్తులు మొదలుకుని కిరాణాలు, సూపర్ మార్కెట్లలో కొనుగోళ్లు ఊపందుకున్నాయి. పట్టణాలకు సైతం సూపర్ మార్కెట్ కల్చర్ విస్తరిస్తోంది. దీనికితోడూ ఆన్‌లైన్ వేదికలు కూడా అందుబాటులో ఉన్నాయి. నిత్యావసర సరకులతోపాటు ఇతర వస్తువులను కొనుగోలు చేస్తుంటారు. ఇదే సమయంలో వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. పలు కిరాణా షాపులు, సూపర్ మార్కెట్‌లు, తదితర వాటిల్లో నాణ్యత లేని, గడవు తీరినవి అంటగట్టే ప్రమాదం ఉంది. తొందరపడి కొనుగోలు చేస్తే మోసపోయే అవకాశం ఉంది.

**అప్రమత్తత అవసరం**

సూపర్ మార్కెట్‌లలో అన్నీ ఒకేచోట లభిస్తాయి కదా అని వినియోగదారులు ఎక్కువగా వాటిలో కొనుగోలుకు మొగ్గు చూపుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని నాణ్యత లేని, కాలం చెల్లినవి కొనుగోలు చేసే ఆస్కారం ఉంది. తొందరలో ఆయా వస్తువుల కాలపరిమితి, నాణ్యతను జాగ్రత్తగా పరిశీలించాలి. ముఖ్యంగా తినే పదార్థాల ప్యాంకింగ్ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రతి ప్యాకెట్‌పై తయారు చేసిన తేదీ, ఎప్పటి వరకు వరకు వాడొచ్చు, ధర, చిరునామా తదితర విషయాలు ఉంటాయి. వీటిని సరి చూసుకోవాలి. ఏదైనా తేడాగా ఉంటే కొనొద్దు. ఒకవేళ మోసపోయామని గుర్తిస్తే వినియోగదారుల ఫోరంకు నిర్ణీత రుసుము చెల్లించి దరఖాస్తు చేసి న్యాయం పొందవచ్చు.

**ఆహార భద్రత అధికారుల జాడేది?**

నిత్యం తనిఖీలు చేసి వినియోగదారులకు నాణ్యమైన, కల్తీ లేని సరకులు అందేలా చర్యలు చేపట్టాల్సిన ఆహార భద్రత అధికారుల జాడ ఉమ్మడి జిల్లాలో కరవైంది మంచిర్యాల మినహా నిర్మల్, కుమురంభీం జిల్లాలకు కలిపి ఒక్కరే అధికారి విధులు నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్‌లో ఒక్కరూ లేరు. వినియోగదారులు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టడంలో జాప్యం జరుగుతోంది. పలుచోట్ల మొక్కుబడి చర్యలతో మమ అనిపిస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

# కొలతల కొర్రీలు.. ముట్టజెబితే బిల్లులు!

సూర్యాపేట : కోదాడ నియోజకవర్గంలోని ఓ మండల పరిధిలో లబ్ధిదారుడు చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణ కొలతలు నిబంధనల మేరకు లేవంటూ గ్రామస్థాయి అధికారి కొర్రీ పెట్టారు. ఇంతలో రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తి మధ్యవర్తిగా జోక్యం చేసుకుని బిల్లులు రావాలంటే కొంత ఖర్చవుతుందని లబ్ధిదారుడి నుంచి రూ.25 వేలు తీసుకున్నట్లు సమాచారం.

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల మంజూరులో పారదర్శకత పాటిస్తున్న అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. ఈ విషయంలో ఒక పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయడంతోపాటు ఒక గ్రామంలోని ఇందిరమ్మ కమిటీ సభ్యుడి సభ్యత్వం రద్దు చేసి కేసు నమోదు చేసింది తెలిసిందే. అయినా కొన్ని ప్రాంతాల్లో వసూళ్ల పర్వం కొనసాగుతోంది. పథకానికి సంబంధించిన కొందరు అధికారులు తమ చేతికి మట్టి అంటకుండా మధ్యవర్తులను ముందుపెడుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇంటి నిర్మాణ కొలతలు నిబంధనల ప్రకారం లేవంటూ సాకులను ముడిపెడుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కొందరు లబ్ధిదారులు బిల్లులు ఆలస్యంగా వస్తాయనే ఆందోళనతో డబ్బులు ఇస్తున్నట్లు సమాచారం. దీన్ని బయటికి చెప్పుకోలేక పోతున్నారు. వసూళ్ల గురించి చెబితే ముమ్ముందు తమకు ఇబ్బందులు ఎదురవుతాయనే భావనతో ముందుకురావడం లేదని వినికిడి.

**అవగాహన కల్పిస్తే మేలు**

600 చదరపు అడుగుల మధ్యలోనే నిర్మించాలనేది నిబంధన. ఈ విషయంలో ఇంకా చాలామంది లబ్ధిదారుల్లో సందేహం. పిల్లర్ల ఆధారంగా కొలతలు వేసి బిల్లులు మంజూరు చేస్తున్నప్పటికీ.. స్లాబ్ వేశాక దాని ఏరియా కూడా 600 చ.అ. మధ్యలోనే ఉండాలా.. ఎక్కువగా ఉన్నా పర్వాలేదా.. అనే విషయంలో అయోమయం నెలకొందని, అధికారులు అవగాహన కల్పించాలని లబ్ధిదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



**తిరిగి ఇచ్చారు?...** వసూళ్లకు పాల్పడుతున్న వారి బండారం బయటపడగానే అధికారులు చర్యలు తీసుకుంటుండంతో హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఓ మండల పరిధిలో వసూళ్లకు పాల్పడుతున్న సంబంధిత అధికారులు భయపడ్డారు. తాపీమేస్త్రీలను ముందుపెట్టి వసూళ్లు చేసిన డబ్బులను తిరిగి లబ్ధిదారులకు ఇచ్చినట్లు తెలిసింది. ఇప్పుడు ఎలాంటి కొర్రీలు పెట్టకుండా లబ్ధిదారుల ఖాతాల్లో బిల్లులను జమ చేస్తున్నట్లు సమాచారం.

**ఫిర్యాదు చేయొచ్చు**

ఇళ్ల నిర్మాణంలో ఇబ్బందులు పెట్టినా.. బిల్లుల మంజూరులో డబ్బులు డిమాండ్ చేసినా నేరుగా రాష్ట్రస్థాయి అధికారులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు అందుకు సర్కారు 18005995991 టోల్‌ఫ్రీ నెంబరును అందుబాటులోకి తీసుకొచ్చింది. వివరాలను గోప్యంగా ఉంచుతారు.

**ఎవరైనా చర్యలు తప్పవు**

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను డబ్బులు డిమాండ్ చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటాం. అందులో ఎవరి ప్రమేయమున్నా చర్యలు తప్పవు. ఉద్యోగుల జోక్యం ఉంటే సస్పెండ్ చేస్తాం.

సిద్ధార్థ, హౌసింగ్ పీడీ, సూర్యాపేట

# వ్యాధుల కాలం.. జర పైలం

మెదక్: వాతావరణ మార్పులతో వ్యాధులు సంభవిస్తాయి. చాలా మంది ఫ్లూ ఇన్‌ఫెక్షన్ బారిన పడుతుంటారు. ముక్కు కారడం, జలుబు, తేలికపాటి జ్వరం, గొంతు నొప్పి, శ్వాస కోశ వ్యాధులు, వివిధ అలర్జీలు వస్తుంటాయి. ఈ సమయంలో ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాలి. బృందం ఆసుపత్రులను సందర్శించగా ఏఏ వ్యాధులతో బాధపడున్నారో తెలిసింది.

**చర్మవ్యాధులు అధికం...**

నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం 200–300 వరకు రోగులు వస్తున్నారు. ఎక్కువగా వైరల్ జ్వరాలు, జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులు, టైఫాయిడ్, మలేరియా, డెంగీ కేసులు వస్తున్నాయి. చిన్నపిల్లల్లోనూ ఈ రకమైన వ్యాధులు కనిపిస్తున్నాయి. వీరిలో అధికంగా చర్మవ్యాధులు ఉంటున్నాయని పిల్లల వైద్యుడు తెలిపారు. నిత్యం 30–50 మంది వస్తున్నారు. చల్లని ప్రదేశాల్లో తిప్పవద్దు: సూరినేని చంద్రశేఖర్, పిల్లల వైద్య నిపుణులు, మెదక్ చలికాలం ఆరంభం కావడంతో జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, దగ్గుతో పాటు జ్వరాలు సోకుతున్నాయి. ఐదేళ్ల



లోపు చిన్నారులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. చల్లని ప్రదేశాల్లో తిప్పరాదు. చల్లని వస్తువులు ఇవ్వవద్దు. గోరు వెచ్చని నీటిని తాగించాలి. చర్మ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. డీ హైడ్రేషన్ కాకుండా ఎప్పటికప్పుడు నీటిని తాగించాలి. చర్మం పొడి బారకుండా మాయిశ్చరైజ్ క్రీమ్‌లు రాయాలి.

**జ్వరం, ఒళ్లు నొప్పులు...**

చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగుల సంఖ్య పెరిగింది. గతంలో ప్రతిరోజు 60 మంది మాత్రమే వచ్చేవారు. కానీ ఇప్పుడు వందమంది వరకు వస్తున్నారు. ఎక్కువగా జ్వరం, దగ్గు, జలుబు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు.

పాపన్నపేట పీహెచ్‌సీలో నిత్యం 80 ఓపీ నమోదవుతోంది. అందులో పది మంది వరకు జ్వరాల బారిన పడిన వారు ఉంటున్నారు. మిగతా వారు జలుబు, ఒళ్లు నొప్పులు, బీపీ, మధుమేహం పరీక్షలకు వస్తున్నారు. పొడ్చన్‌పల్లి ఆరోగ్య కేంద్రంలో 70 ఓపీ నమోదవుతోంది. ఎక్కువగా వైరల్ జ్వరాల కేసులు వస్తున్నాయి.

శివ్వంపేటలో గర్భిణులు, పిల్లలు, మధుమేహం, రక్తపోటు సమస్యలు, శరీర నొప్పులు, ఇతర ఆరోగ్య సమస్యలతో దవాఖానాకు వస్తున్నారు.

**జిల్లాలో ఆసుపత్రులు ఇలా...**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 21
ఉప కేంద్రాలు 59
పల్లె, బస్తీ దవాఖానాలు 98, 2
సర్వజన, ప్రాంతీయ ఆసుపత్రులు 1, 1
సామాజిక వైద్యశాల 3
ఈ నెలలో చిక్సిలు పొందిన రోగులు 32,390

# పక్కాగా నిషేధిత జాబితా నవీకరణ

ఖమ్మం: జిల్లాలో సర్కారు, అసైన్డ్ భూములు ఎక్కడెక్కడ ఎన్ని ఉన్నాయో రెవెన్యూ అధికారులు పక్కాగా లెక్కలు తీస్తున్నారు. దస్త్రాలను జల్లెడ పట్టి మిగులు భూములు వెలికితీస్తున్నారు. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాలయ భూములతోపాటు రహదారులు, వివిధ నిర్మాణాలకు సేకరించిన స్థలాలు, సీలింగ్ భూములను నిషేధిత జాబితా(సెక్షన్–22(ఎ)(1)లోకి చేర్చుతారు. ఈ వివరాలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే భవిష్యత్తులో అక్రమ రిజిస్ట్రేషన్లకు తావుండదు. 2017 నుంచి జాబితాను సక్రమంగా సవరించకపోవడం తో కొందరు ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో దస్త్రాన్ని పక్కాగా రూపొందించడానికి 20 రోజులుగా జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ అధికారులు పాత రికార్డులతో కుస్తీ పడుతున్నారు.

**ప్రయోజనం ఇలా..**

దాదాపు ఎనిమిదేళ్లుగా నిషేధిత జాబితాను సవరించలేదు. ఇటీవల పలు ప్రాంతాల్లో ప్రభుత్వం వ్యవసాయ భూములు సేకరించి రహదారులు, సాగునీటి కాల్వలు నిర్మిస్తోంది. నూతన కార్యాలయాలూ వెలిశాయి. ఈ సర్వే నంబర్ల పేరుతో అక్రమ రిజిస్ట్రేషన్లు కాకుండా ఉండాలంటే వీటన్నింటిని నిషేధిత జాబితాలోకి చేర్చాలి. జిల్లాలో జాబితా సవరణ జోరుగా సాగుతోంది. గ్రామాల వారీగా తహసీల్దార్లు పంపిన దస్త్రాలను కలెక్టర్, అదనపు కలెక్టర్ల సంతకాలతో వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు.

**అయిదు పద్ధతుల్లో దస్త్రాలు**

1. జిల్లాలోని ప్రభుత్వ, పోరంబోకు, బంచరాయి, అసైన్డ్ భూముల వివరాలు 22(ఏ)(1)(ఏ) రిజిస్టర్‌లో పొందుపరుస్తారు. ప్రభుత్వ భూమి సుమారు 1,84,189.28 ఎకరాల్లో ఉంది. ఇందులో అత్యధికంగా సత్తుపల్లి మండలంలో, తక్కువగా బోనకల్లు మండలంలో ఉంది. అసైన్డ్ భూమి 47,442.66 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. వీటిల్లో అత్యధికంగా సత్తుపల్లి, తక్కువగా కామేపల్లి మండలంలో ఉన్నాయి. ప్రభుత్వ, అసైన్డ్ భూములను పేదలకు పంచడంతోపాటు ప్రభుత్వ కార్యాలయాల కోసం కేటాయించారు. అవి పోను ఇంకా ఎంతమేర మిగిలి ఉన్నాయో అధికారులు సర్వే చేస్తున్నారు. చెరువులు, గుట్టలు, ఇళ్ల స్థలాలకు సంబంధించిన వ్యవసాయేతర భూమి ఎంతుందో దస్త్రాలను పరిశీలిస్తున్నారు.

2. ప్రభుత్వ భూముల్లో రైల్వేలు, రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, అన్ని రకాల ప్రభుత్వ కార్యాలయాలు, నీళ్లట్యాంకులు, ఆసుపత్రులు నిర్మించారు. నూతనంగా ఖమ్మం–దేవరచర్ల గ్రీన్‌ఫీల్డ్, నాగ్‌పుర్–విజయవాడ జాతీయ రహదారులు నిర్మిస్తున్నారు. సీతారామ ఎత్తిపోతల కాల్వలు తవ్వుతున్నారు. వీటిన్నింటిని 22(ఏ)(1)(బి) రిజిస్టర్‌లోకి చేర్చి నిషేధిత జాబితాలో ఉంచుతారు. తద్వారా రైతుభరోసా నిధులు దుర్వినియోగమయ్యే ఆస్కారం

ఉండదు. 3. వక్ఫ్, దేవాదాయ శాఖలకు సంబంధించిన భూములను 22(ఏ)(1)(సి) రిజిస్టర్‌లో చేర్చుతారు. వీటిల్లో వ్యవసాయ భూములతోపాటు కల్యాణ మండపాలు, దుకాణాలు, కార్యాలయాలు నిర్మించారు. ఈ రిజిస్టర్‌ను ఆయా శాఖలు రెవెన్యూ అధికారులకు అందించినట్టు తెలిసింది. 4. సీలింగ్, సర్‌ప్లస్ ల్యాండ్లను 22(ఏ)(1)(డి) రిజిస్టర్‌లో నమోదు చేయాలి. సీలింగ్ భూముల్లో కొన్నింటిని పేదలు పంచింది. ఇవిపోగా మిగులు భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో ఆరాతీస్తూ రిజిస్టర్ రూపొందిస్తున్నారు. 5. నోటిపై భూములను 22(ఏ)(1)(ఈ) రిజిస్టర్‌లో పొందుపరుస్తున్నారు. నయీమ్, అగ్రిగోల్డ్ స్థలాలతోపాటు సీబీఐ, సీఐడీ సంస్థలు జప్తు చేసిన వాటిని ప్రభుత్వం నోటిపై చేస్తుంది.

# ఆరోగ్య పరీక్ష.. అతివకు రక్ష



సంగారెడ్డి : ఇంటి పనులు, పిల్లల పోషణ, ఇతరత్రా బాధ్యతలతో గృహిణులు నిత్యం తీరిక లేకుండా ఉంటున్నారు. మరికొందరు ఇంటి బాధ్యతలతో పాటు ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం తదితర పనులతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. వీరు వేళకు తినకపోవడం, సరిపడా నిద్ర లేకపోవడం తదితర కారణాలతో అనారోగ్యానికి గురవుతున్నారు. సకాలంలో వైద్యం చేయించుకోక పోవడం వల్ల ఒక్కోసారి ప్రాణాలకూ ముప్పు వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో మహిళలకు బాసటగా నిలవాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'ఆరోగ్య మహిళ' పేరిట ఉచితంగా ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి అవసరమైతే జిల్లా ఆసుపత్రికి.. లేదంటే హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. సకాలంలో వైద్యం అందేలా కృషి చేస్తున్నారు.

**జిల్లాలోని 13 పీహెచ్‌సీల్లో..**

జిల్లాలోని 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. బిలాల్‌పూర్, బొల్లారం, హత్నూర, ఝరాసంగం, జిన్నారం, కల్హేర్, కంది, కంగ్టి, కానుకుంట, కొండాపూర్, మునిపల్లి, న్యాల్‌కల్, రామచంద్రాపురంలోని పీహెచ్‌సీల్లో ఈ కార్యక్రమం పేరిటి ప్రతి మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా వివిధ రకాల క్యాన్సర్ల అనుమానితులు, థైరాయిడ్ సమస్య, సూక్ష్మ పోషక లోపాలు, రక్తహీనత తదితరాలపై దృష్టి సారిస్తున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. వ్యాధి తీవ్రత ఆధారంగా ఇతర ఆసుపత్రులకు పంపిస్తున్నారు. క్యాన్సర్ రోగుల కోసం ఇప్పటికే సంగారెడ్డిలో 20 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొచ్చారు.

**'ఆరోగ్య మహిళ' పరీక్షలు ఇలా..**

(ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు)
ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాలు: 13
పేర్లు నమోదు చేసుకున్నవారు: 22,582
క్యాన్సర్ కేసులు: 19
మూత్రాశయ సమస్యలు: 1971
పోషక లోపం: 2399
థైరాయిడ్ సమస్యలు: 3608
రక్తహీనత: 5905
పీహెచ్‌సీల నుంచి పై ఆసుపత్రులకు తరలించిన రోగులు: 976

జాగ్రత్తలు పాటించాలి

మహిళలు పనుల్లో తీరిక లేకుండా ఉంటున్నప్పటికీ ఆహారం, ఆరోగ్యానికి తప్పనిసరిగా కొంత సమయాన్ని కేటాయించాలి. సమతుల ఆహారం తీసుకోవాలి. కనీసం 6–8 గంటలు నిద్రపోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. వయసుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలి. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తినాలి. శరీరంలో అనారోగ్య మార్పులు గమనిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. నాగనిర్మల, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి

# ఉత్తరం రాయండి.. ఉత్తమంగా నిలవండి



మెదక్ : గతంలో ఉత్తరాలు రాసి బంధువులు, స్నేహితుల యోగ క్షేమాలు తెలుసుకునే వారు. ప్రస్తుతం చరవాణి ద్వారా సమాచారాన్ని పంపుతున్నాం, తెలుసుకుంటున్నాం. కార్యాలయాలు, కంపెనీలు, సంస్థలైతే ఉత్తర, ప్రత్యుత్తరాలు మెయిల్ ద్వారా పంపిస్తున్నారు. గూగుల్ మీట్ ద్వారా సమావేశాలు నిర్వహిస్తున్నారు. విద్యాలయాల్లోనూ డిజిటలైజేషన్ కొనసాగుతోంది. ఇలాంటి తరుణంలో చేతిరాత మరుగున పడుతోంది. ఈ విషయాన్ని తపాలా శాఖ గ్రహించి, ఉత్తరాల ద్వారా సమాచారం పంపే పద్ధతిని మళ్లీ తెరపైకి తెచ్చింది. వ్యాసాన్ని రాసి లేఖలు పంపాలని "ఢాయి ఆఖర్" అనే కార్యక్రమానికి 2017లో తపాలా శాఖ శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది సైతం సర్కిల్ (రాష్ట్ర), జాతీయ స్థాయిల్లో పోటీలకు ఉత్తరాలను ఆహ్వానిస్తోంది.

**రాయాల్సిన అంశాలు...**

'లెటర్ టూ మై రోల్ మాడల్' అను అంశంపై లేఖ రాయాలి.
హిందీ, ఆంగ్లం ఏ భాషలోనైనా రాయవచ్చు
ఎన్వలప్ కవర్‌లో రాసేవారు ఎ–4 సైజ్ తెల్ల కాగితంలో వెయ్యి పదాలకు మించకుండా రాయాలి
ఇన్‌లాండ్ లెటర్‌లో 500 పదాలు మించకూడదు.
రెండు విభాగాల్లో పోటీలు
ఈ పోటీలను రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. మొదటిది 18 ఏళ్లలోపు వారికి, రెండోది 18 ఏళ్లు దాటిన వారికి (ఇన్‌లాండ్ లెటర్, ఎన్వలప్) విడివిడి పోటీల్లో పాల్గొని లేఖలు రాయవచ్చు.

**లేఖ పంపాల్సిన చిరునామా....**

లేఖ కవరుపై వయసు రాసి అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని జత చేయాలి.
ద చీఫ్‌పోస్ట్‌మాస్టర్ జనరల్, ఫిలటెల్లి సెక్షన్ (ఢాయి ఆఖర్) తెలంగాణ సర్కిల్ హైదరాబాద్–500001 చిరునామాకు డిసెంబరు 8వ తేదీలోపు పంపాలి.

**బహుమతులు ఇలా...**

సర్కిల్ స్థాయిలో ప్రథమ స్థానం రూ.25 వేలు, ద్వితీయ స్థానం రూ.10 వేలు, తృతీయ స్థానంలో రూ.5 వేలు, జాతీయ స్థాయిలో ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ రూ. 25 వేలు, తృతీయ స్థానంలో రూ.10 వేలు చొప్పున నగదు పురస్కారం అందిస్తారు.

**ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

దస్తూరికి పూర్వవైభవం తీసుకు వచ్చేందుకే తపాలా శాఖ ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. దీని వల్ల లేఖలు రాసే సంప్రదాయం అలవడడంతో పాటు ఉత్తమంగా రాసిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు రావడంతో పాటు నగదు పురస్కారం సైతం ఉండడంతో డివిజన్ పరిధిలోని విద్యార్థులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పోస్టు చేయడంలో ఇబ్బందులుంటే నేరుగా ప్రధాన తపాలా శాఖలో సంప్రదించవచ్చు. శ్రీహరి, ఇన్‌ఛార్జి తపాలా పర్యవేక్షకులు, మెదక్ డివిజన్

# జనరిక్ దుకాణం.. రుణంతో సాకారం

సంగారెడ్డి : పేదరిక కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యం బారినపడితే ఆర్థికంగా ఎదురయ్యే ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినా మందులు(ఔషధాలు) ఎక్కువగా బయటే కొనాల్సిన పరిస్థితి ఉండటమే కారణం. పేదలు అప్పులు చేసి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇలాంటి వారికి ఊరట కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జనరిక్ మందుల దుకాణాలు నిర్వహిస్తోంది. మహిళా సంఘాల ఆధ్వర్యంలో మండలానికి ఒకటి చొప్పున జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు స్త్రీనిధి రుణాలు మంజూరు చేస్తున్నారు.

**రూ.3 లక్షల స్త్రీనిధి రుణం**

జిల్లా వ్యాప్తంగా ప్రజలకు జనరిక్ ఔషధాలు అందుబాటులోకి తీసుకురావాలని అధికార యంత్రాంగం ముందుకు సాగుతోంది. మహిళా సంఘాల సభ్యుల్లో అర్హులకు దుకాణాల ఏర్పాటుకు స్త్రీనిధి రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఒక్కో దుకాణం ఏర్పాటుకు రూ. 3లక్షల రుణం అందించనున్నారు. తొలివిడతలో మండలానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

**మంజూరు ఇలా..**

స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలు కావడంతో పాటు వారి కుటుంబం, దగ్గరి బంధువుల్లో ఎవరైనా డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎంఫార్మసీ విద్యార్హత కలిగి ఉండాలి.

రుణం పొందడానికి ముందు.. సభ్యురాలి సంఘం, గ్రామైక్య సంఘం తీర్మానం తప్పనిసరి.

స్త్రీనిధి అధికారులు దరఖాస్తులు పరిశీలించి అర్హులుగా భావిస్తే వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేస్తారు.

జనరిక్ దుకాణం కోసం తీసుకునే రుణాన్ని ప్రతినెలా వాయిదాల రూపంలో ఐదేళ్లలోపు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది.

దుకాణం నిర్వహణకు సంబంధిత డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అనుమతి, ధ్రువీకరణ పత్రం, కొటేషన్, విద్యార్హత ధ్రువపత్రాలతో స్త్రీనిధి అధికారులకు దరఖాస్తు చేయాలి.

**సద్వినియోగం చేసుకోవాలి** జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు స్త్రీనిధి ద్వారా ప్రోత్సహిస్తున్నాం. తక్కువ వడ్డీకి ఇస్తున్న రుణాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. కుటుంబంలో ఎవరైనా దుకాణం ఏర్పాటుకు అవసరమైన విద్యార్హత కలిగి ఉంటే దరఖాస్తు చేసుకోవాలి. సులభ వాయిదాల పద్ధతిలో రుణాన్ని తిరిగి చెల్లించే వెసులుబాటు ఉంటుంది. శ్రీనాథ్, స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్

జిల్లాలో మహిళా పొదుపు సంఘాలు: 18,213
సభ్యులు: 1.90 లక్షల మంది

# భవనాలు పూర్తయ్యేదెన్నడో..!

ఇల్లంతకుంట: సొంత భవనాల్లో కొన్ని, అద్దె భవనాల్లో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. కొన్నింటికి నిధులు మంజూరైనా పనులు సాగక చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు.

**ఇదీ పరిస్థితి**

ఇల్లంతకుంట మండలంలోని 35 గ్రామాలలో 64 అంగన్‌వాడీ కేంద్రాలు నడుస్తున్నాయి. అందులో 35 సొంత భవనాల్లో 17 పాఠశాలల్లో మిగతావి 12 అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.

అద్దె భవనాల్లో సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇందులోని చిన్నారులకు అవస్థలు తప్పడంలేదు. పైగా కిరాయి తక్కువ ఉండటంతో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

అద్దె భవనాల్లో చిన్నారుల ఆటల కోసం ఏర్పాటు చేయాల్సిన పరికరాలను స్థలాభావంతో ఏర్పాటు చేయడం లేదు. దీంతో పిల్లలు ఆటాపాటతో కూడిన విద్యకు దూరమవుతున్నారు.

మండలంలోని ముస్కానిపేట, ఇల్లంతకుంటలో పనులు ప్రారంభించినా.. కొన్నేళ్లుగా ముందుకు సాగడంలేదు. ప్రస్తుతం ఈ రెండింటికి టెండర్లు పిలిచేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

కొత్తగా ఎనిమిదింటికి ఒక్కో దానికి రూ.12 లక్షల చొప్పున నిధులు నెల క్రితం మంజూరయ్యాయి. ఇందులో ఈజీఎస్‌లో రూ.8 లక్షలు, గ్రామ పంచాయతీ 15వ కమిషన్ కింద రూ.2 లక్షలు, ఐసీడీఎస్ కింద రూ.2 లక్షలు వెచ్చిస్తారు.



కొన్నిచోట్ల భవనాలకు అనుకూలంగా ఉన్నా.. మరికొన్ని చోట్ల స్థలం లేక పనులు ప్రారంభించడం లేదు. గతంలో నిర్మాణాలు ప్రారంభించిన 6 భవనాల మిగులు పనులకు సైతం నిధులు మంజూరుకాగా పనులు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి.

తెనుగువానిపల్లెతోపాటు ఎర్రాన్‌పల్లెలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు రూ.5 లక్షల చొప్పున మంజూరు కాగా మిగతా నాలుగు భవనాల మిగులు పనులకు రూ.9 లక్షలు మంజూరు చేశారు కానీ.. పనులు వేగవంతంగా లేకపోవడంతో పాటు నిర్మాణం పూర్తయ్యేనా అన్న సందేహాలు కలుగుతున్నాయి.

పనులు దక్కించుకున్న గుత్తేదారులు నిధులు సరైన సమయంలో అందకపోవడంతో పనుల్లో వేగవంతం చేయలేకపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవనాలను త్వరితగతిన పూర్తి చేయించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**చిన్నారుల ఇబ్బందులు తీరుస్తాం**

– ఉమారాణి, ఐసీడీఎస్ సీడీపీవో సొంత భవనాలు లేనిచోట అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకొని ప్రతిపాదనలు పంపిం చాం. కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాలకు ఇటీవలే నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని గ్రామాల్లో మిగిలిపోయిన భవనాలకు నిధులు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి. త్వరితగతిన పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. త్వరలో చిన్నారుల ఇబ్బందులు తీరుస్తాం.

# యాప్ వేదిక.. మద్దతు ధరల సూచిక

సిరిసిల్ల: విత్తుకునే సమయంలో అనావృష్టి.. పూత, కాయల దశలో అతివృష్టి.. అన్నీ తట్టుకొని ఎదిగిన పంటపై చీడపీడల దాడి.. ఈ ఏడాది పత్తి రైతులను కోలుకోకుండా చేసింది. ఇక చేతికందిన పంటను వ్యాపారుల జిమ్మిక్కులకు తట్టుకుని నిలబడి మద్దతు ధరకు విక్రయించిన వారికే ఈ ఏడాది సం'పత్తి'. ఈసారి ఉమ్మడి జిల్లాలో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) 23 చోట్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. కలెక్టర్లు జిన్నింగ్ మిల్లుల్లోని భద్రతా పరమైన ఏర్పాట్లను పరిశీలించాకే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా సన్నాహాలు జరుగుతున్నాయి. ఇదిలా ఉంటే.. కేంద్రం పత్తి రైతుకు మద్దతుధర లభించేలా 'కపాస్ కిసాన్' అనే యాప్‌ను తీసుకొచ్చింది. దీంతో రైతుల అనుకూలమైన సమయంలో తమకు నచ్చిన మిల్లులో పత్తిని విక్రయించుకునే అవకాశం ఉంది.

**ఆచరిస్తేనే ప్రయోజనం**

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది 11 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. 'కపాస్ కిసాన్' యాప్‌ను రైతులు విస్తృతంగా వినియోగించినప్పుడే దాని లక్ష్యం నెరవేరుతుంది. తొలుత ఈ యాప్‌ను రైతులు సెల్‌ఫోన్లో డౌన్‌లోడ్ చేసుకొని, స్లాట్ బుక్ చేసుకునేందుకు తన పంట వివరాలు నమోదు చేయాలి. ఏఈవోలు పంట నమోదులో తీసుకున్న ఫోన్ నంబరు, ఆధార్‌కార్డుకు అనుసంధానం చేసినదీనికే ఓటీపీ వస్తుంది. దీనిలో సవరణకు ఏఈవోలను సంప్రదించాలి.

యాప్‌లో స్లాట్ బుక్ చేసుకునే సమయంలోనే తేదీ, ఇతర వివరాలు వస్తాయి. దీనిపై రైతులకు అవగాహన అంతంత మాత్రమే.

నిబంధనల ప్రకారం తేమ 8 శాతంలోపు ఉంటేనే క్వింటాకు రూ.8,110 లభిస్తుంది. రైతులు మిల్లుకు తీసుకొచ్చే నాటికే 8 నుంచి 12 తేమ సరిచూసుకోవాలి. లేదంటే కొనుగోళ్ల ప్రక్రియ మొదటికొస్తుంది. గతంలోనూ టోకెన్ విధానం అమలులోనూ ప్రతికూల పరిస్థితులు తలెత్తాయి. దీంతో రైతులు మిల్లులు, మార్కెట్ యార్డుల ఎదుట ఆందోళనకు దిగారు.

వచ్చేది శీతాకాలం. పత్తిలో 12 శాతంలోపు తేమ రావడం గగనం. ఇలాంటి పరిస్థితుల్లో కొందరు రవాణాభారంతో వెనక్కి వెళ్లలేక, అయినకాడికే మిల్లుల్లోనే అమ్మేస్తుంటారు.

రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని కొందరు రైతులు క్వింటాకు రూ.6 వేల నుంచి రూ.6500 ధరలకు దళారులకు అమ్మేస్తున్నారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో పెట్టుబడి ఖర్చులు ఇచ్చిన అడ్తీదారులు, ఎరువులు, విత్తనాల దుకాణాదారుల మధ్యవర్తులకు విక్రయిస్తున్నారు. వీటన్నింటిని పర్యవేక్షించే ఉమ్మడి జిల్లా మార్కెటింగ్‌శాఖలో డీఎంవో (జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారుల)ల కొరత ఉంది. జగిత్యాల డీఎంవోకు రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు బాధ్యతలు అప్పగించారు. వరంగల్ మార్కెట్లోని సీనియర్ అసిస్టెంటుకు కరీంనగర్ డీఎంవో అదనపు బాధ్యతలిచ్చారు. కామారెడ్డి డీఎంవోకు పెద్దపల్లి మార్కెట్ బాధ్యతలు అప్పగించారు. కార్యాలయాల్లోని అరకొర సిబ్బందితో కొనుగోళ్లపై పర్యవేక్షణ గగనంగా మారనుంది.

# విద్య.. నైపుణ్య వృద్ధి

భువనగిరి : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) యోజన కింద పాఠశాలల్లో వివిధ కార్యక్రమాల అమలుకు నిధులు మంజూరవుతూనే ఉన్నాయి. సామగ్రి సైతం అందించిన విషయం తెలిసిందే. వాటి సక్రమ అమలుకు ఉన్నతస్థాయి అధికారులు తరచూ తనిఖీలు, పర్యవేక్షణలు సైతం చేపడుతుండటం విశేషం. తాజాగా ఈ పాఠశాలల్లో రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్(ఆర్ఏఏ) అమలుకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆరు నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థుల సమగ్ర సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటు అందించేలా గణిత, సైన్స్ సర్కిల్స్, ఎక్స్‌పోజర్ విజిట్, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖ నిపుణులతో మార్గదర్శనం చేసేలా చర్యలు తీసుకోనున్నారు. సంబంధిత వివరాలు క్లుప్తంగా..

**పీఎంశ్రీ పాఠశాలలో ఆర్ఏఏ...**

ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మొత్తం 84 పాఠశాలలు పీఎంశ్రీకి ఎంపికయ్యాయి. వీటిలో 24,370 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ విద్యా సంవత్సరమంతా ఆర్ఏఏ కార్యక్రమం అమలు కోసం



విద్యార్థుల సంఖ్య ఆధారంగా మూడు జిల్లాలకు రూ.1.59 కోట్లు మంజూరయ్యాయి. వీటి అమలుపై ఇప్పటికే ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అవగాహన కల్పించినట్లుగా తెలిసింది. ప్రతి పాఠశాలలో మూడు గణిత, మూడు సైన్స్ సర్కిళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రతి సర్కిల్‌లో 10–15 మంది విద్యార్థులుండాలి. క్విజ్, ప్రాజెక్టుల నిర్వహణ, గణిత, సైన్స్‌డే నిర్వహణ, తదితర కార్యక్రమాల కోసం ప్రతి సర్కిల్‌కు రూ.5 వేల చొప్పున నిధులు కేటాయించారు. ప్రదేశాలు చారిత్రాత్మక స్థలాలు, సైన్స్ సెంటర్లు, యూనివర్సిటీల సందర్శన (ఎక్స్‌పోజర్ విజిట్) కోసం ప్రతి విద్యార్థికి రూ.500 చొప్పున బడ్జెట్ కేటాయించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, అవార్డు గ్రహీతలతో ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో విద్యార్థులకు మార్గదర్శనం చేయించాలి. ఇందుకు జాతీయ స్థాయి నిపుణులకు రూ.5 వేలు, అంతర్జాతీయ స్థాయి నిపుణులకు రూ.10వేల చొప్పున ఖర్చు చేయాల్సి ఉంటుంది.

# వనంలో ఆనంద క్షణాలు

రామాయంపేట : నిత్యం ఉరుకులు పరుగుల యాంత్రిక జీవితంలో సెలవు రోజు.. అది ప్రకృతిలో మమేకమైతే ఆ ఆనందమే వేరు.. సేద తీరేందుకు విహారానికి దూర ప్రాంతాలకు వెళ్లాలంటే కొంత ఖర్చుతో కూడుకున్న పనే.. కానీ సమీపంలోనే అటవీ ప్రాంతంలో పక్షుల కిలకిలరావాల మధ్య 24 గంటలు గడపడం వంటి క్షణాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఈ నేపథ్యంలోనే రామాయంపేట మండల పరిధి పర్వతాపూర్ అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు ఆహ్లాదాన్ని పంచేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

అటవీ ప్రాంతం మెదక్, కామారెడ్డి జిల్లాలతో పాటు హైదరాబాద్‌కు సమీపంలో ఉంది. ఇక్కడ పలు రకాల జంతువులతో పాటు నాలుగైదు రకాల పక్షి జాతులు ఉన్నాయి. వాటిని చూడడంతో పాటు రాత్రుళు గడిపేందుకు సౌకర్యాల కల్పనకు అధికారులు ప్రణాళికలు చేసున్నారు.

**అనుమతులు రాగానే అందుబాటులోకి..**

పర్యాటకంగా అనువైన ప్రాంతాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. ఇందులో సఫారీ వాహనం, వాచ్ టవర్, తాగడానికి శుద్ధ జలం, సోలార్ పంప్‌సెట్, 15 కాటేజీల నిర్మాణం చేపట్టి రాత్రుళ్లు బస చేసేందుకు అవకాశం కల్పించడంతో పాటు ఆహారం అందించనున్నారు. అనుమతులు వచ్చిన వారంలోపే తాత్కాలిక మరమ్మతులతో అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

**రూ.8.4 కోట్లతో...** పర్వతాపూర్ అటవీ ప్రాంతం సుమారు 700 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీంతో వన్యప్రాణి అభయారణ్యాన్ని హరిత నిధి కింద రూ.8.4 కోట్లతో 80 ఎకరాల్లో తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు పంపారు. ఇందులో 10 కిలోమీటర్ల మేర రహదారిని ఏర్పాటు చేసి ఫారెస్టు అందాలను నేరుగా చూసేందుకు సఫారీ వాహనాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు.

అభివృద్ధి చేయడానికి ఏర్పాట్లు

జోజి, డీఎఫ్‌వో, మెదక్

పర్వతాపూర్ అటవీ ప్రాంతం పర్యాటకానికి చాలా అనుకూలంగా ఉంది. ఇందులో భాగంగానే అభివృద్ధి చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. హైదరాబాద్ నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చేందుకు అవకాశం ఉంటుంది.

# పలుకుబడి ఉంటే మరో దుకాణం

గోదావరిఖని: రామగుండం ప్రాంతంలో కొంత మంది రేషన్ డీలర్ల దందా కొనసాగుతోంది. పలుకుబడి ఉన్న వారికే అదనపు దుకాణాలు కేటాయిస్తున్నారు. రేషన్ దుకాణాల రేషనలైజేషన్ ద్వారా ప్రతి దుకాణానికి సమానంగా కార్డులు కేటాయించాలి. దీనికి రామగుండం ప్రాంతంలోని కొంత మంది డీలర్లు చక్రం తిప్పుతున్నారు. దీంతో ఒక్కో డీలర్‌కు 2000 వరకు కార్డులు ఉంటున్నాయి. రామగుండం ప్రాంతంలో 18 రేషన్ దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. వీటికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఇతరులకు కేటాయించకుండా ఇన్‌ఛార్జులతోనే నిర్వహిస్తున్నారు.

**ఏళ్ల తరబడి ఖాళీ**

రామగుండం ప్రాంతంలో 18 రేషన్ దుకాణాల డీలర్లను వివిధ కారణాలతో తొలగించారు. రామగుండం కార్పొరేషన్‌లో మొత్తం 34 రేషన్ దుకాణాలు ఉండగా ఇందులో 18 దుకాణాలకు అసలు డీలర్లు లేరు. ఖాళీలు ఏర్పడిన వెంటనే అధికారులు కొత్త వారిని నియమించేందుకు చర్యలు తీసుకోవాలి. లేదంటే స్వశక్తి సంఘాల మహిళా గ్రూపులకు కేటాయించాలి. మంథని ప్రాంతంలో ఖాళీ అయిన వెంటనే ఆరు దుకాణాలను మహిళా సంఘాలకు కేటాయించారు. రామగుండం ప్రాంతంలో ఖాళీ దుకాణాలను కొత్త వారికి కేటాయించకుండా కొంత మంది డీలర్లు తమకు అనుకూలంగా ఉన్న వారికి అదనపు బాధ్యతలు అప్పగించే విధంగా అధికారులను మేనేజ్ చేస్తున్నారు. దీంతో ఒక్కో డీలర్‌కు అదనంగా రెండు దుకాణాలు కేటాయించారు. కొంత మందికి ఒక్కో దుకాణం అదనపు బాధ్యతలు అప్పగించారు. ఒక్కొక్కరు రెండు నుంచి మూడు దుకాణాలు నిర్వహిస్తున్నారు.

**క్రమబద్ధీకరణ తప్పనిసరి**

కార్డుల ఆధారంగా రేషన్ దుకాణాన్ని రేషనలైజేషన్(క్రమబద్ధీకరణ) చేయాలి. దీని వల్ల మొత్తం కార్డుల్లో 34 మంది డీలర్లకు విభజించి కేటాయించడం ద్వారా అందరూ సమానంగా బియ్యం పంపిణీ చేసేందుకు అవకాశం ఉంటుంది. చాలా కాలంగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఖాళీ దుకాణాలకు కొత్త డీలర్ల ఎంపికకు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఉన్న వారికే వేలల్లో ఉంటుండగా కొంతమంది డీలర్లు అతి తక్కువ కార్డులతోనే నెట్టుకొస్తున్నారు.

# ఆయుష్ పోస్తున్నారా.. తీస్తున్నారా..?

హైదరాబాద్: గ్రేటర్‌లో ఆయుర్వేదం పేరుతో కొందరు రోగులకు టోకరా వేస్తున్నారు. క్యాన్సర్, పక్షవాతం, మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధులను తగ్గించడం, లైంగిక సామర్థ్యం పెంచేందుకు మందులు ఇస్తామని బురిడీ కొట్టిస్తున్నారు. నకిలీ ఆయుర్వేద మందులను అంటగడుతున్నారు. బీఏఎంఎస్ డిగ్రీ లేకపోయినా ఆయుర్వేద వైద్యులుగా చలామణి అవుతూ ఏకంగా ఔషధ దుకాణాలు నడిపిస్తున్నారు. గల్లీకి ఒకటీరెండు షాపులు ఇలాంటివి దర్శనమిస్తున్నాయి. వాటికి డైరెక్టర్ ఆఫ్ ఆయుష్ నుంచి అనుమతులే ఉండటం లేదు. కొన్నింటికి గతంలో అనుమతులిచ్చినా మళ్లీ వాటిని పునరుద్ధరించుకోలేదు.

**ఒక్కరే డ్రగ్ ఇన్‌స్పెక్టర్...**

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఇతర జిల్లాల్లో తనిఖీలు చేసేందుకు ఆయుర్వేద డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఒక్కరే ఉన్నారు. దీంతో నకిలీ దుకాణాలపై పర్యవేక్షణ లోపించింది.

**ఇలా గుర్తించొచ్చు...**

ఆయుర్వేద మందులపై భారత ప్రభుత్వం జారీ చేసిన ఆయుష్ లైసెన్సు నంబరు లేదా ఆయుష్ మార్క్ తప్పకుండా ఉండాలి.

మందులపై తయారీ తేదీ, ప్రాంతం, బ్యాచ్ నంబరు, సంస్థ చిరునామా పక్కాగా ఉండాలి. ఐఎస్‌వో, ఎఫ్‌ఎస్ఎస్ఏఐ ధ్రువీకరణలు తప్పనిసరి. కాగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ లాంటి ప్రాంతాల్లో తయారీ సంస్థలున్నట్లు తప్పుడు చిరునామాలతో మార్కెట్‌లోకి వదులుతున్నారు. అసలు కంపెనీలకు స్పష్టమైన ప్యాకింగ్, ప్రింటింగ్, హాలోగ్రామ్, లోగో ఉంటాయి. నకిలీ ఉత్పత్తులను దగ్గరగా పరిశీలిస్తే ఇలాంటివి కనిపించవు. ఉన్నా అస్పష్టంగా ఉంటాయి. స్పెల్లింగుల్లో అక్షరాలు అటుఇటు చేసి ముద్రించి ఉంటాయి. కొనేముందు జాగ్రత్తగా గమనించాలి.


ధర తక్కువగా ఉండటం, మందులు రసాయన వాసన వచ్చినా ఒక్కరోజులోనే వ్యాధి నయం లాంటి ప్రకటనలు ఉంటే నకిలీవిగా అనుమానించాలి. అనుమానం వస్తే 1800-599-696 నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు.

ప్రకటనలు చూసి మోసపోవద్దు

–డాక్టర్ ఉమాశ్రీనివాస్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు

నకిలీ ఆయుర్వేద మందులు ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. రోడ్డు పక్కన విక్రయించే వాటిని అసలు విశ్వసించడానికి వీల్లేదు. ఇక సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలు పట్ల అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా ఎలాంటి డిగ్రీలు లేకుండా ఏవో మూలికలు నూరి ఇస్తామంటే జాగ్రత్తగా ఉండాలి. బీఏఎంఎస్ డిగ్రీ ఉన్న వైద్యులనే సంప్రదించాలి.

# ఉద్గారాలను గుర్తించేదెలా.. తగ్గించేదెలా..?



హైదరాబాద్: సమర్థవంతమైన వాయునాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడంతో జాతీయ వాయుశుద్ధి కార్యక్రమ (ఎన్ఏఎంపీ) లక్ష్యం అందుకోవడంలో నగరం వెనకడుగేస్తోంది. 10కంటిన్యూస్ యాంబియెంట్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్లు (సీఏఏక్యూఎంఎస్) ఏర్పాటు చేసినా రాజధాని పరిధిలో 55శాతం వాయునాణ్యత నిఘా ఉండటం లేదు. దీంతో ఉద్గారాలను గుర్తించి తగ్గించడంలో సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రధాన నగరాల్లో వాయునాణ్యత స్థితిని అంచనా వేసిన సెంటర్‌ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సంస్థ సైతం తాజా అధ్యయనంలో ఇదే విషయంవెల్లడించింది. సీపీసీబీ మార్గదర్శకాల ప్రకారం జనాభా ఆధారంగా స్టేషన్ల సంఖ్య పెంచాలని స్పష్టం చేసింది.

**గ్రేటర్‌లో మొత్తం 30 స్టేషన్లు కావాలి**

గ్రేటర్‌లో 30 సీఏఏక్యూఎంఎస్ కేంద్రాలు అవసరం. గాలి కాలుష్యానికి ప్రధాన కారకాలు సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, ఓజోన్, కార్బన్‌డయాక్సైడ్, పీఎం 2.5, పీఎం 10. ఇవి గాల్లో ఏ స్థాయిలో ఉన్నాయో లెక్కించడమే వీటి పని. ఈ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సెన్సార్లు ఒక రోజులో వెలువడిన ఉద్గారాల స్థాయి..? వాయునాణ్యత ఎంత క్షీణించిందో గణాంకాలతో రికార్డు చేస్తాయి. ఈ వివరాలను ఎప్పటికప్పుడు రాష్ట్ర, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)లకు పంపుతాయి. ఎన్జీటీ మొట్టికాయలు వేయడంతో పీసీబీ 2022లో 6 కేంద్రాలను ఏర్పాటు చేసింది. అంతకుముందు హెచ్‌సీయూ, సనత్‌నగర్, ఇక్రిశాట్ పటాన్‌చెరు, జూపార్కు వద్ద ఉండేవి. ఇవి 2 నుంచి 5 కిలోమీటర్ల పరిధిలోనే వాయునాణ్యతను లెక్కిస్తుండటంతో మిగిలిన ప్రాంతాల్లో స్థితిని కచ్చితంగా అంచనా వేయలేకపోతున్నారు. రాజధాని సమీపంలో పాశమైలారం, బొల్లారం, ఐఐటీహెచ్‌ప్రాంతాల్లో ఏర్పాటు చేసినా శివారు ప్రాంతాల్లో స్థితిని పూర్తిగా అంచనా వేయడం లేదు.

**మాన్యువల్ స్టేషన్లున్నా..**

నిరంతర వాయునాణ్యత పర్యవేక్షణ కేంద్రాలతో పాటు సంప్రదాయ పద్ధతిలో ఉద్గారాలను లెక్కించేందుకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి స్టేట్ యాంబియెంట్ ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ స్టేషన్ల(మాన్యువల్ స్టేషన్ల)ను నగరంలో పలు చోట్ల ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఉద్గారాల నమూనాల సేకరణకు రెండు రోజుల సమయం పడుతుండగా ల్యాబ్‌కు పంపి ఫలితాలు విశ్లేషించేందుకు మరికొంత సమయం వృథా అవుతోంది. దీనికి బదులు ప్రతి పది నిమిషాలకోసారి అంచనా వేసే నిరంతర పర్యవేక్షణ కేంద్రాలను పెంచితే కాలుష్య ఉద్గారాలను నియంత్రించే అవకాశం ఉంది.

జనాభా – కోటిన్నర

వాహనాలు– 85 లక్షలు

పరిశ్రమలు – 5 వేలు

ఏటా చేపట్టే నిర్మాణాలు – 6వేలు

15 ఏళ్లకు పైబడిన వాహనాలు – 3లక్షలు (అంచనా)

# నిర్లక్ష్యంతో నిలిచిన మత్స్య విత్తన ఉత్పత్తి



శంకరపట్నం: ఉత్తర తెలంగాణలో నాణ్యమైన, ఉన్నత ప్రమాణాలు కలిగిన మత్స్య విత్తనాల ఉత్పత్తి కేంద్రంగా భాసిల్లిన కేశవపట్నం మత్స్య విత్తన ఉత్పత్తి కేంద్రం అలంకారప్రాయంగా తయారైంది. ఉత్పత్తి నిలిచిపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రంలోని నీటి తొట్టిలు, సామగ్రి మూలనపడ్డాయి. కేంద్రంలో నీటి వసతితోపాటు అన్ని సౌకర్యాలున్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యం చూపుతున్నారని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల నాయకులు వాపోతున్నారు.

**వెలుగు వెలిగి..**

శంకరపట్నం మండల కేంద్రం కేశవపట్నంలో 1985లో అప్పటి ప్రభుత్వం మత్స్య విత్తన ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కాకతీయ ప్రధాన కాలువ దిగువన దీనిని నిర్మించగా 1987 నుంచి ఏటా ఉత్పత్తి జరిగింది. క్రమంగా కోట్ల విత్తనాలు ఉత్పత్తి చేసే స్థాయికి చేరుకుంది. రెండు కిలోల బరువున్న 10 ఆడ, 20 మగ చేపలను, 2 సంవత్సరాల వయసు పైబడినవాటిని చెరువుల నుంచి ఫిబ్రవరిలో తీసుకొచ్చి ఉత్పత్తి కేంద్రంలో పెంచుతారు. వర్షాకాలం సీజన్‌లో ఆశించిన విధంగా వాతావరణం అనుకూలిస్తే ఆడ, మగ చేపలను ఒకే నర్సరీలో వేసి సీడింగ్ ఇచ్చి ఇంజక్షన్ వేస్తారు. మూడు రోజుల్లో గుడ్లు ఉత్పత్తి అవుతాయి. నాలుగు రోజులు అందులోనే ఉంచి తరువాత విత్తనాలను వేరు చేసి తొట్లలో వేసి దాణా వేస్తూ నిర్దేశిత పరిమాణానికి వచ్చాక అమ్మకానికి సిద్ధం చేస్తారు. ఈ విధంగా ఏటా కోటి నుంచి రెండు కోట్ల మేర చేప పిల్లల ఉత్పత్తి జరిగేది. **ఇతర ప్రాంతాల నుంచి దిగుమతితో నష్టం**

– సంపత్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, గద్దపాక

కేశవపట్నంలోని మత్స్య విత్తన ఉత్పత్తి కేంద్రంలోని అనుకూలమైన వాతావరణంలో ఉత్పత్తి చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా సరఫరా చేస్తే లాభం వస్తుంది. ఇతర ప్రాంతాల నుంచి విత్తనాల దిగుమతితో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కేంద్రంలో తిరిగి ఉత్పత్తి ప్రారంభించాలి.

**ప్రతిపాదనలు పంపించాం**

– రామ్‌ధాన్, మత్స్య విత్తన అభివృద్ధి అధికారి

నీటి సౌకర్యం లేక అయిదేళ్ల కిందటి నుంచి విత్తన ఉత్పత్తిని నిలిపేశారు. కేంద్రంలో ఉత్పత్తికి అవసరమైన సామగ్రి కూడా దెబ్బతింది. నెల రోజుల కిందట ఇంజినీరింగ్ అధికారులతో రూ.1.55 కోట్లతో ప్రతిపాదనలు చేయించి ఉన్నతాధికారులకు పంపించాం.

# ఆన్‌లైన్ మోజు.. అధిగమిస్తే తారాజువ్వలు

నాంపలి : సమయం ఎంతో విలువైనది. గడిచిన కాలాన్ని ఎవరూ తీసుకురాలేరు. దాన్ని సద్వినియోగం చేసుకుంటేనే బంగారు భవిష్యత్తు. యువత చాలామంది జీవితానికి లక్ష్యమంటూ లేకుండా గడిపేస్తున్నారు. చరవాణుల్లో అంతర్జాలాన్ని వినియోగిస్తూ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో యువత ఖాళీ సమయాల్లో ఏం చేస్తోంది..? ఏ విషయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు..? అన్న అంశంపై ఉమ్మడి జిల్లాలో వంద మంది యువతీ యువకులను ప్రశ్నించగా వచ్చిన సమాధానాలు ఇలా ఉన్నాయి.

**సామాజిక మాధ్యమాలకు అధికం శాతం**

చాలామంది యువత ఖాళీ సమయాల్లో ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్‌ల్లో రీల్స్ చూస్తున్నారు. నచ్చిన అంశాన్ని అంతర్జాలంలో శోధిస్తున్నారు. చదువు, ఉద్యోగాలకు సంబంధించిన అంశాల గురించి నెట్లో వెతుకుతున్నట్లు తక్కువ మంది వెల్లడించారు. రోజూ వార్తలు చదువుతామని చెప్పేవారు తక్కువగానే ఉన్నారు. యూట్యూబ్‌లో వీడియోలు, కొన్ని యాప్‌లలో పాటలు వినడం కొందరికి నిత్యకృత్యమైంది.



**మిడిమిడిలో.. వడివడిగా..**

ఆధునిక యుగంలో ప్రతి విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడం, ఎక్కడి నుంచో వచ్చిన కొన్ని అసత్య ప్రచారాలను వ్యాప్తి చేయడంలో కొందరు తెలియకుండానే ఇరుక్కుపోతున్నారు. సాధ్యాసాధ్యాలను అంచనా వేయకుండా ఇతరులకు షేర్ చేయడమే వారి పనిగా పెట్టుకుంటున్నారు. ఈ ఊబిలో పడి కుటుంబానికి సమయం కేటాయించలేకపోతున్నారు. పడక గదిలోనూ సామాజిక మాధ్యమాలను వీడని వారి సంఖ్య పెరుగుతూనే ఉంది.

**ఆటలూ ఎక్కువే..**

ఉమ్మడి జిల్లాలో చాలామంది యువత ఆన్‌లైన్ ఆటలకు బానిసలుగా మారారు. తల్లిదండ్రులు మందలిస్తే గట్టిగా అరవడం, ఇంట్లో ఏ పని చెప్పినా చేయకుండా ఎదురు సమాధానం చెబుతున్నారు. కొందరు ఆన్‌లైన్ ఆటలకు బానిసలుగా మరి బలవన్మరణాలకూ పాల్పడుతున్న ఘటనలూ అక్కడక్కడా వెలుగు చూస్తూనే ఉన్నాయి. మైదానాల్లో ఆటలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి.

**పోటీ పరీక్షల అన్వేషణ తక్కువే..**

చరవాణుల ఉపయోగంతో కొందరు తప్పుదారిలో పయనిస్తుంటే.. మరి కొందరు ఉన్నత లక్ష్యాలను చేరుకుంటున్నారు. ఉద్యోగాల కోసం సమాయత్తమవుతూ పోటీ పరీక్షలకు అవసరమైన సమాచారం కోసం అంతర్జాలంలో శోధిస్తున్నారు. కొత్త విషయాల గురించి అన్వేషణ, ప్రాజెక్టు పనుల రూపకల్పనకు చరవాణి వాడుతున్న వారు కొందరే.

# ఆరేళ్లుగా.. హమాలీ బకాయిలు!

నల్గొండ : ధాన్యం కొనుగోలుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే నల్గొండ జిల్లాలో ప్రారంభమవగా.. కేంద్రాల్లో విక్రయించడానికి వచ్చిన అన్నదాతలు హమాలీ ఛార్జీలు క్వింటాకు రూ.45 చెల్లించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ధాన్యం తూకం వేసి సంచుల్లో నింపి లోడింగ్ చేయడానికి హమాలీలకు రైతులు వీటిని చెల్లించాలి. గతంలో రూ.40 నుంచి రూ.42 వరకు వసూలు చేశారు. ఈసారి ధర పెంచారు. రైతులు హమాలీ ఛార్జీలు చెల్లిస్తే తర్వాత వారి ఖాతాకు జమ చేస్తామని ప్రభుత్వం కొన్ని ఏళ్ల నుంచి చెబుతూ వస్తోంది. కానీ ఇప్పటి వరకు ఏ రైతుకూ ఒక్క రూపాయి జమ చేసిన దాఖలాల్లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇస్తుందా లేక పాత ఒరవడినే కొనసాగిస్తుందా అన్న దానిపైనా స్పష్టత లేదు.

**అన్నదాతలపై భారం**

గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో దాదాపు పది విడతల్లో ధాన్యం కొనుగోలు చేశారు. ఆ ఐదేళ్లూ రైతులకు హమాలీ ఛార్జీలు చెల్లించలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడో విడత ధాన్యం కొనుగోలుకు ఉపక్రమించింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు ఏటా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుంది. అదే అంచనాలతో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వం బోనస్ ప్రకటించడంతో 90 శాతం రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు. రైతులకు ఉన్న ధరల ప్రకారం హమాలీ



ఛార్జీల రూపంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు సీజన్లకు కలిపి రూ.10.40 కోట్లు వరకు భారం పడింది. పన్నెండు విడతలుగా ఇప్పటి వరకు రూ.58.37 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. బకాయిలు, హమాలీ ఛార్జీల చెల్లింపులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు లేవని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**ప్రభుత్వం చెల్లించాలి**

కొనుగోలు కేంద్రాల్లోధాన్యం కాంటా వేసిన వెంటనే హమాలీలు ఛార్జీలను రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. గతంలో ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పారు. కొన్ని రోజులు గడిచిన తర్వాత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కానీ ప్రభుత్వం గత ఛార్జీలనే జమ చేయలేదు. ఈసారైనా ఇచ్చి రైతులపై భారం తగ్గించాలి. సైదులు, రైతు కనగల్

## ఈసారి ముందస్తుగా సన్నద్ధత

నేలకొండపల్లి : విద్యార్థుల భవితకు తొలిమెట్టు పదో తరగతి. ఇందులో మంచి మార్కులు సాధిస్తే ఎన్నో అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా సెప్టెంబరు 1 నుంచే ముందస్తు ప్రణాళిక రూపొందించారు. ఏటా జనవరి నెలలో ప్రత్యేక తరగతులు ప్రారంభించటంతో పది ఫలితాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులు వెనకబడుతున్నారు. ఈ విషయం గమనించిన రాష్ట్ర పాఠశాల విద్య కార్యదర్శి యోగితారాణా ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు సెప్టెంబరు నెల నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో సోమవారం నుంచి ఖమ్మం, భద్రాద్రి జిల్లాలో ప్రత్యేక తరగతులు ప్రారంభమయ్యాయి.

**ఉదయం, సాయంత్రం నిర్వహణ**

రోజువారీగా ఉదయం 8 గంటల నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం 4:15 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తారు. ఏ రోజు ఏ సబ్జెక్టు చదవించాలో షెడ్యూల్ విడుదల చేశారు. వారంలో సోమవారం ఉదయం సాంఘికశాస్త్రం, సాయంత్రం తెలుగు, మంగళవారం ఉదయం తెలుగు, సాయంత్రం హిందీ, బుధవారం ఉదయం బయాలజీ, సాయంత్రం ఇంగ్లిష్, గురువారం ఉదయం ఇంగ్లిష్, సాయంత్రం గణితం, శుక్రవారం ఉదయం మ్యాథ్స్, సాయంత్రం ఫిజికల్ సైన్స్, శనివారం ఉదయం ఫిజికల్ సైన్స్, సాయంత్రం సోషల్ స్టడీస్ చదివించాలి. సందేహాల నివృత్తికి ఆయా సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండాలి.

**వచ్చే నెల 10లోపు..**



పదో తరగతి సిలబస్ అక్టోబరులో 10వ తేదీలోపు పూర్తి చేయాలి. ఈ క్రమంలో తరగతుల నిర్వహణపై పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీ ప్రత్యేక అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి. వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యే ముందు రివిజన్ తరగతులు, ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాలి. ప్రత్యేక తరగతులకు వంద శాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలి. ప్రత్యేక తరగతులను తరగతి గదిలో మాత్రమే నిర్వహించాలి. గ్రీన్‌బోర్డులతో పాటు డిజిటల్ బోర్డులను ఉపయోగించాలి. బృంద చర్చలు చేసుకొనే వెసులుబాటు కల్పించాలి.

ఉన్నత పాఠశాలలు
ఖమ్మం: 227
భద్రాద్రి: 124
విద్యార్థులు
ఖమ్మం: 1,231
భద్రాద్రి: 9,702

జిల్లాల వారీగా పదో తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఎంఈఓలతో పాటు ఆయా ప్రధానోపాధ్యాయులకు సమాచారాన్ని అందించాం. వంద శాతం ఫలితాల కోసం పకడ్బందీ ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రుల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా శ్రమిస్తాం. అల్పాహారం విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తాం. బి.నాగలక్ష్మి, డీఈఓ, భద్రాద్రి

## కరకట్టతోనే తప్పేను వరద తిప్పలు

ధర్మపురి: ఏటా వర్షాకాలం వచ్చిందంటే చాలు ధర్మపురి పట్టణవాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని కాలం వెళ్లదీస్తుంటారు. లోతట్టు ప్రాంతాల కాలనీవాసులు భారీ వర్షాలుపడితేచాలు ముల్లేమూట సర్దుకొని బతుకు జీవుడా అంటూ పునరావాస కేంద్రాలు, బంధువుల ఇళ్లకు వెళ్తుంటారు. భారీ వర్షాల సమయంలో ధర్మపురి పట్టణంలోకి వరద నీరు వస్తుండటమే ఇందుకు కారణం. సమస్య నివారణకు కరకట్ట నిర్మించాని ఏళ్లుగా చర్చ జరుగుతుంది. ఇప్పటివరకు ఎలాంటి నిధులు కేటాయించడం లేదు.

**ఒడ్డులకు కోతతో..**

గోదావరి నది దమ్మన్నపేట నుంచి ధర్మపురి తీరానికి ప్రవేశించే సమయంలో దక్షిణాభిముఖంగా ప్రవహిస్తుంది. ఇక్కడ దశాబ్దాల కిందట సహజసిద్ధంగా ఒండ్రు మట్టితో గుట్టలగా ఉండేది. ఇదంతా వరదలకు కొట్టుకుపోయింది. ధర్మపురి వద్ద నదిలో గండ శిలలు(బండరాళ్లు) ఎత్తుగా నీటికి అడ్డుగా ఉండేవి. ఇసుక కూడా విపరీతంగా ఉండేది. ఎంత వరద వచ్చినా పట్టణంలోకి ప్రవేశించకుండే ఇవి ఆపేవి. బండరాళ్లు కొల్లకొట్టడం, ఇసుక అక్రమ రవాణాతో ధర్మపురి పట్టణంలోకి వేగంగా వరద వస్తోంది. పట్టణానికి ఈశాన్యభాగంలో



మఠం రేగడి భూముల గడ్డ కూడా మాయం కావడంతో వరదకు అడ్డులేకుండా పోయింది.

**ముప్పు ఎక్కడంటే..**

కుమ్మరి, బ్రాహ్మణసంఘం వాడ, శ్రీరామాలయం, శ్రీదత్తాత్రేయస్వామి ఆలయం, మంగళిగడ్డ, బోయెవాడ, ఒడ్డెరకాలనీలు గోదావరి వరద ముప్పు ప్రాంతాలు. నదిలో నీటిమట్టం పెరిగిందంటే ఈ కాలనీల వీధులు జలమయంగా మారుతాయి. 2022లో భారీ ఎత్తున వరదలు రావడంతో వారం రోజుల పాటు పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. 1995లో నిర్మల్ జిల్లాలోని కడెం ప్రాజెక్టుకు గండి పడటంతో గోదావరిలోకి పది లక్షల క్యూసెక్కులు రావడంతో పై ప్రదేశాలను వరదలు ముంచెత్తాయి. బాధితుల కట్టుబట్టతోనే మిగిలారు. అపారనష్టం వాటిల్లింది.

**మోక్షం ఎప్పుడు?** ధర్మపురి గోదావరి తీరంలో సుమారు 2 కి.మీల మేర కరకట్ట నిర్మించాల్సి ఉంది. 2022లో అప్పటి ప్రభుత్వానికి పురపాలక సంఘం రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపించింది. ఎన్నికలు రావడంతో అక్కడితోనే ఆగిపోయారు. దమ్మన్నపేట చివరి ప్రాంతం నుంచి ధర్మపురి మహాలక్ష్మీ పుష్కరఘాట్ వరకు కరకట్ట నిర్మించినట్లయితే నీరు పట్టణంలోకి రాకుండా రక్షణ గోడలాగా ఉంటుంది. రూ.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

## విద్యార్థులకు చదువు.. ప్రజలకు సేవలు




తాండూరు : కొడంగల్ వైద్య కళాశాలకు 50 వైద్య సీట్లు కేటాయిస్తూ జాతీయ వైద్య కమిషన్ నిర్ణయించింది. తాజాగా జరుగుతున్న కౌన్సెలింగ్‌లోనే విద్యార్థులు ఇక్కడికి రానున్నారు. ఆల్ ఇండియా, రాష్ట్ర కోటాలో మొత్తం సీట్లు భర్తీ చేయనున్నారు. వైద్య కళాశాలను తాండూరు జిల్లా ఆస్పత్రిలో కొనసాగించేందుకు ఇప్పటికే డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఆధీనంలోకి తీసుకుంది. అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచారు. ఇప్పటికే ప్రొఫెసర్లు విధుల్లో చేరగా, బోధన నిపుణులు త్వరలో రానున్నారు.అత్యవసర చికిత్స ఇక్కడే: అత్యవసర, ప్రత్యేక చికిత్సలు అవసరమైతే జిల్లా ప్రజలు హైదరాబాద్‌కు పరుగులు తీసేవారు. మెరుగైన వైద్యం అందాలంటే ప్రైవేటుకో లేక ఉస్మానియా, గాంధీ ఆస్పత్రులకు పంపించేవారు. ఇక నుంచి ఈ కష్టాలు దూరం కానున్నాయి. తాండూరు జిల్లా ఆస్పత్రిలోనే అత్యవసర, వివిధ రకాల ప్రత్యేక సేవలు అందనున్నాయి. ఇందుకోసం దవాఖానాకు అవసరమైన పరికరాలు, లిఫ్టింగ్ మంచాలు, రోగ నిర్ధారణ, చికిత్సలకు అత్యాధునిక పరికరాలు, సౌకర్యాలను సమకూర్చారు. ఆచార్యులు, నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో అందించే శస్త్రచికిత్సలు తాండూరులోనే అందనున్నాయి. చిన్నారులు, ఫిజియోథెరపీ, కళ్లు, చెవి, ముక్కు, గొంతు, కిడ్నీ, ఎముకలు, మహిళా సంబంధమైన చికిత్సలు, మానసిక, మెదడు, నరాలు, వివిధ రకాల ప్రత్యేక శస్త్రచికిత్సలు, అవసరమైన రక్త పరీక్షలు, అన్ని రకాల చికిత్సలు జరగనున్నాయని వైద్య సిబ్బంది పేర్కొంటున్నారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయని వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజు కు వివరించారు.

**రూ.27 కోట్లతో..** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్‌లో రూ.27 కోట్ల వ్యయంతో వైద్య కళాశాల కొత్త భవన నిర్మాణం కొనసాగుతోంది. అప్పటివరకు కళాశాలను తాండూరు జిల్లా ఆస్పత్రిలో నిర్వహించనున్నారు.

ఇక్కడ ప్రతి రోజు 800పైగా రోగులు వైద్యం చేయించుకుంటున్నారు. కళాశాల నిర్వహణ నేపథ్యంలో వైద్య విద్యార్థులకు బోధనతోపాటు, ప్రజలకు వైద్య సేవలు అందనున్నాయి. జిల్లా నలుమూలల నుంచి వికారాబాద్, కొడంగల్, పరిగి నియోజకవర్గాల ప్రజలతో పాటు సరిహద్దు కర్ణాటకకు చెందిన రోగులు సైతం తాండూరు ఆస్పత్రికి వస్తారు. ఇక నుంచి రోజువారీగా వచ్చేవారి సంఖ్య పెరిగే అవకాశం ఉంది. వైద్య విద్యార్థుల వసతికి తాండూరు మైనార్టీ విద్యాలయ భవనాన్ని తాత్కాలికంగా సమకూర్చారు.

## శిథిలావస్థలో ఉన్నా.. తిష్ఠవేశారు!



హుజూరాబాద్ : హుజూరాబాద్ పట్టణ సమీపంలోని ప్రభుత్వానికి చెందిన కేసీక్యాంపు భవనాల్లో పలువురు అక్రమంగా నివాసం ఉంటున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం క్వార్టర్లను నిర్మించగా.. అప్పట్లో నీటిపారుదలశాఖకు చెందిన వందలాది ఎస్సారెస్పీ ఉద్యోగులకు కేటాయించారు. తదనంతరం నీటిపారుదల శాఖలోని పలు విభాగాలను హుజూరాబాద్ నుంచి తరలించటంతో ఇక్కడ కొందరే ఉద్యోగులు మిగిలారు. కేసీక్యాంపు క్వార్టర్లలో చాలా వరకు శిథిలావస్థకు చేరటంతో మెరుగ్గా ఉన్న వాటిని వారికి కేటాయించారు. అయితే ఉద్యోగకాలం ముగిసిన క్వార్టర్ల నుంచి ప్రస్తుతం వారు కదలటం లేదు. రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. కొందరు ఉద్యోగుల సంబంధీకులు కూడా తిష్టవేశారు. సంబంధిత అధికారులు వారి పేరిట చెల్లింపులు చేస్తున్నారు. వారందరిని ఖాళీ చేసి.. ఈ భవనాలను పూర్తిస్థాయిలో తొలగించటానికి అధికారులు వారికి పలుమార్లు కోర్టు నోటీసులు అందజేసిన లాభం లేదు.

**ప్రమాదకరమని తెలిసినా..**

దాదాపు 30 విశ్రాంత ఉద్యోగుల, ఉద్యోగుల సంబంధీకుల కుటుంబాలు క్వార్టర్లలో నివాసం ఉంటున్నాయి. ఆ భవనాలు పెచ్చులూడి కూలిపోయే స్థితికి చేరిన వారు బయటకి రావటం లేదు. శిథిలావస్థకు చేరి, పగుళ్ల బారిన పడి, పిచ్చిమొక్కలతో దుర్భరంగా దర్శనమిస్తున్నాయి. ఖాళీ చేయకుండా కొందరు ఉన్నతాధికారులతో ఈఈ, డీఈ స్థాయి అధికారులపై ఒత్తిళ్లు తెస్తున్నట్లు సమాచారం. ప్రైవేటు వ్యక్తులు ప్రభుత్వ భవనాల్లో దర్జాగా ఉంటున్నా అధికారులు నోరు మెదపకపోవటం గమనార్హం. ఈ విషయంలో జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు చొరవచూపాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై సంబంధిత డీఈ రాయబారపు ప్రసాద్‌ను వివరణ కోరగా.. క్వార్టర్లలో నివాసముండే వారిని బయటకు పంపించేందుకు.. నీటిసరఫరా, విద్యుత్తు సేవలను నిలిపి వేశామని.. అయినా వారు కదలడం లేదన్నారు. నోటీసులు ఇచ్చినా స్పందించకపోవటం బాధాకరమని, ఉన్నతస్థాయి అధికారుల చొరవ అవసరమని చెప్పారు.

## పంచాయతీలపై కేంద్రం పర్యవేక్షణ



గోదావరిఖని: గ్రామ పంచాయతీల బలోపేతానికి కేంద్రం దృష్టి సారించింది. ప్రస్తుతం పాలకవర్గాలు లేకపోవడంతో ఆర్థిక సంఘం నిధులు రావడం లేదు. పంచాయతీల నిర్వహణ, అభివృద్ధితో పాటు సిబ్బంది వేతనాల చెల్లింపు అంశాల్లో నిధుల కొరత వెంటాడుతోంది. పంచాయతీలను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం 'సమర్థ్ వెబ్ పోర్టల్'ను ప్రారంభించింది. దీని ద్వారా పంచాయతీల పాలనతో పాటు అభివృద్ధికి సంబంధించిన అంశాలను కేంద్రం పర్యవేక్షించనుంది. గ్రామ పంచాయతీలకు పన్నులు, పన్నేతర ఆదాయం ద్వారా సాధారణ నిధి సమకూరుతోంది. జనాభా ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ప్రస్తుతం పర్యవేక్షణ లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వ నిధులకు సంబంధించి ఈ పోర్టల్‌ను వినియోగించుకొని బలోపేతం చేయనుంది.

**నిధులు మళ్లించకుండా నిఘా**

కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు విడుదల చేసే నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పనులకు మళ్లిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనికి చెక్ పెట్టేందుకే పోర్టల్‌ను ప్రారంభించినట్లు తెలుస్తోంది. కేంద్రం కేటాయిస్తున్న నిధులు నేరుగా గ్రామపంచాయతీలకు చేరే విధంగా పర్యవేక్షించనుంది. ఇతర రాష్ట్రాల్లో ఇదివరకే ఈ పోర్టల్‌ను ఏర్పాటు చేసి సమర్థంగా పంచాయతీల పనితీరును మెరుగుపర్చింది. అదే విధంగా ఈ పోర్టల్‌ను తాజాగా ఏర్పాటు చేసి నిధుల వెచ్చింపుతో పాటు ఆర్థిక పరిపుష్టికి తీసుకోవాల్సిన నిర్ణయాలు, సలహాలను అందించనుంది.

**సలహాలు.. సూచనలు** గ్రామ పంచాయతీలను ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సలహాలు సూచనలు అందించనుంది. డిజిటల్ వేదిక ద్వారా నేరుగా పంచాయతీలను పర్యవేక్షించడంతో పాటు మరింత బలోపేతం చేసేందుకు పంచాయతీరాజ్ నిపుణులతో అధ్యయన కమిటీని నియమించింది. సొంత ఆదాయ వనరులు పెరుగుదలకు ఆచరణీయమైన నమూనాను రూపొందించనుంది. ఉమ్మడి జిల్లాలో 1214 గ్రామ పంచాయతీలున్నాయి. రానున్న కాలంలో ఇవి మరింత బలోపేతమయ్యే అవకాశం ఉంది.

## ముందు 'చూపు' ఎంతో మేలు




నిజామాబాద్ : అన్ని అవయవాల్లో నేత్రాలు ఎంతో ముఖ్యమైనవని.. చూపును కాపాడుకోవాలని ఇన్‌ఛార్జి ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు ఎం.సాయారెడ్డి విద్యార్థులకు సూచించారు. చిన్నప్పట్నుంచే తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లా కేంద్రంలోని కోటగల్లీ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. లయన్స్ క్లబ్ నిజామాబాద్ సెంట్రల్ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ నేత్ర వైద్యశాల వైద్యులు డా.సుప్రజ, డా.భుజంగరెడ్డి, లక్ష్మీనర్సయ్య 160 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించారు. కంటిచూపును కాపాడుకోవాలంటే ఫోన్లకు దూరంగా ఉండాలని వారు సూచించారు. 36 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించిన నిర్వాహకులు.. త్వరలో ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో అస్మా జరీన్, సుజాత, ప్రమీత పాల్గొన్నారు.

## ములాఖత్‌లు.. ముడుపుల లెక్కలు

నిజామాబాద్ : నిజామాబాద్ నగరపాలక సంస్థను అవినీతి చీడ వదలడం లేదు. లంచావతారుల్లో ఎవరో ఒకరు అవినీతి నిరోధక శాఖకు పట్టుబడుతూనే ఉన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, టౌన్ ప్లానింగ్‌లో రోజుల పాటు దస్త్రాలు ముందుకు కదలడం లేదన్న ఆరోపణలున్నాయి. నగరపాలకంలో పలు విభాగాల్లో పనుల కోసం ప్రజలు చెప్పులరిగేలా తిరుగుతున్నారు. అయినా ఫైళ్లు ముందుకు కదలవు. చివరకు లాభం లేదనుకుని దళారులను లేదా కొందరు ప్రైవేటు లైసెన్స్‌డ్ ఇంజినీర్లను బాధితులు ఆశ్రయిస్తున్నారు. వారు అడిగినంత ముట్టజెబితే మాత్రం పనులు పూర్తవుతున్నాయి. ఎక్కడైనా ప్రభుత్వ కార్యాలయాల్లో సాయంత్రం విధులు పూర్తవగానే ఉద్యోగులు ఇళ్లకు బయల్దేరి వెళుతుంటారు. కానీ, నగరపాలకంలో కొందరు అవినీతి ఉద్యోగుల దినచర్య ఇందుకు విభిన్నంగా ఉంటోంది. పొద్దువాలాకే వారి అసలు పని మొదలవుతుందని సమాచారం. దళారులతో ములాఖత్ కావటం, ఆ రోజుకు సంబంధించిన ముడుపుల లెక్కలు సరిచూకోవడం పరిపాటి అయ్యిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికీ గండిపడుతోంది. లంచం తీసుకుంటూ ఆర్.ఐ. శ్రీనివాసాచారి పట్టుబడటం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.



**ఇప్పటివరకు ఆరుగురు..**

గతంలో కమిషనర్‌గా పనిచేసిన నజీం హైమద్, అకౌంటెంట్ ఓ కాంట్రాక్టర్ వద్ద డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. మరో ఘటనలో లంచం తీసుకుంటూ బిల్ కలెక్టర్‌గా నరేందర్ చిక్కాడు. ఎంబీ (మెజర్‌మెంట్ బుక్) రికార్డు చేసే విషయమై ఆమ్యామ్యాలు పుచ్చుకుంటూ మున్సిపల్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు దొరికాడు. గత సంవత్సరం ఆగస్టులో ఇన్‌ఛార్జి రెవెన్యూ అధికారి ఇంట్లో సోదాలు జరపగా.. రూ.6 కోట్ల నగదు, పలు అక్రమాస్తులు బయటపడ్డాయి. తాజా ఘటనలో రెవెన్యూ విభాగంలో ఆర్ఐ రూ.7 వేలు తీసుకుంటూ పట్టుబడ్డాడు.

**ఉద్యోగం నుంచి తొలగిస్తున్నా మారరే**

గతంలో అనిశాకు చిక్కిన ఇద్దరు ఉద్యోగులను ఉద్యోగాల్లోంచి శాశ్వతంగా తొలగించారు. మరో ఉద్యోగి ఏసీబీకి చిక్కిన వెంటనే భవనంపై నుంచి దూకాడు. ఈ ఘటనలో అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఇంత జరుగుతున్నా కొందరు అవినీతి అధికారుల్లో మార్పు రావటం లేదు. ప్రస్తుతం అనిశాకు చిక్కిన రెవెన్యూ ఉద్యోగి గతంలోనూ ఇదే పనికి పాల్పడ్డాడు. అయినా తీరు మారలేదు. ఉద్యోగంలో తిరిగి చేరిన తర్వాతా లంచావతారం ఎత్తాడు. ఈ నేపథ్యంలో అన్ని విభాగాలను ప్రక్షాళన చేయాలని, అవినీతికి తావులేకుండా పర్యవేక్షణ, నిఘా పెంచాలని నగరవాసులు కోరుతున్నారు.

'నగరపాలక సంస్థలో ఏ విభాగంలో డబ్బులు అడిగినా వెంటనే నా దృష్టికి తీసుకురండి. దీర్ఘకాలం తిష్ట వేసి అక్రమాలకు పాల్పడకుండా రెగ్యులర్, ఒప్పంద సిబ్బందిని సెక్షన్లు మార్చుతున్నాం. ఇంకా ఎలాంటి దిద్దుబాటు చర్యలు చేపట్టాలో ఆలోచించి ఆచరణలో పెడతాం.'
దిలీప్‌కుమార్, నగరపాలక కమిషనర్

## రవాణాకు కష్టం.. ఆర్టీసీకి నష్టం

కామారెడ్డి : అసలే ఆదాయ వనరులు లేక చతికిలపడుతున్న ఆర్టీసీకి ఊహించని విధంగా వచ్చిన వరదలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. కామారెడ్డిలో వరదల కారణంగా ఆగస్టు 27 నుంచి 31వ తేదీ వరకు ఆర్టీసీ దాదాపు రూ.90 లక్షల ఆదాయం కోల్పోయింది. ఆగస్టు 27వ తేదీన తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో కామారెడ్డిలో పెద్దచెరువు కాల్వ పొంగి ఉద్ధృతంగా పారింది. తద్వారా జీఆర్ కాలనీ వద్ద పాత జాతీయరహదారి కోతకు గురైంది. హైదరాబాద్ వైపు వెళ్లే రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇది తీవ్ర ప్రభావం చూపింది.

**ప్రయాణానికి ఆటంకం**

నిజామాబాద్ వైపు వెళ్లే క్రమంలో అడ్లూర్ ఎల్లారెడ్డి చెరువు వరద నీరు జాతీయరహదారి పైకి రావడంతో కోత పడింది. దీంతో రోడ్డు ఓ వైపు ధ్వంసమైంది. ఆర్టీసీ బస్సుల ప్రయాణానికి ఆటంకం కలిగింది. భిక్కనూరు మండలంలో ఎడ్లకట్ట వాగు పొంగి జాతీయరహదారిని ముంచెత్తడంతో అక్కడ కూడా ఇబ్బందులు తలెత్తాయి. నిజామాబాద్, హైదరాబాద్ మార్గాల్లో ఆగస్టు 30న మరమ్మతుల అనంతరం




రాకపోకలకు పునరుద్ధరించారు. బీబీపేట మార్గంలో వరద కారణంగా రోడ్డు ధ్వంసం కావడంతో రాకపోకలు నిలిచాయి. మరో వైపు కరీంనగర్ మార్గంలో మూడు రోజుల పాటు ప్రయాణం సాగలేదు. పాల్వంచ వాగు ఉద్ధృతంగా పారడంతో ఇరువైపులా రాకపోకలు నిలిచాయి. రోడ్ల మరమ్మతులు వేగవంతమైతేనే రాకపోకలు పునరుద్ధరిస్తామని ఆర్టీసీ డీఎం కరుణశ్రీ న్యూస్‌టుడేకి వెల్లడించారు. వరదల కారణంగా ఆర్టీసీ ఆదాయం కోల్పోవడం బాధాకరమన్నారు.

**ఏయే మార్గాల్లో ఇబ్బందులంటే...**

కామారెడ్డి- నిజాంసాగర్ మార్గంలో బస్సులు నడవడం లేదు. జిల్లాకేంద్రం నుంచి కృష్ణాజివాడి, తాడ్వాయి, ఎర్రాపహాడ్ మీదుగా లింగంపేట వరకు మాత్రమే బస్సుల రాకపోకలు సాగుతున్నాయి. లింగంపేట నుంచి ఎల్లారెడ్డి వెళ్లే మార్గంలో రోడ్డు ధ్వంసం కావడంతో ప్రయాణానికి అనువుగా లేదు.

కామారెడ్డి నుంచి గుండారం, రామారెడ్డి మండలం గిద్దకు బస్సుల రాకపోకలు నిలిపివేశారు. రోడ్లు పూర్తిగా దెబ్బతినడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు వెల్లడించారు.




## అబుదాబిలో పారిశ్రామిక వేత్తలతో వరుస భేటీ

అమరావతి, అక్టోబరు23 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు యుఏఈలో పర్యటిస్తున్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు యూఏఈ పర్యటనలో బిజీ బిజీగా ఉన్నారు. తన పర్యటనలో భాగంగా రెండో రోజు అబుదాబీలో ముఖ్యమంత్రి చంద్రబాబు వరుసగా పారిశ్రామిక వేత్తలతో సమావేశం అవుతున్నారు. అబుదాబీ చాంబర్ ఛైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్ జాబీ, జీ 42 సీఈఓ మాన్సూర్ అల్ మాన్సూరీతో భేటీ అయ్యారు. ఈ సమావేశాల్లో ఏపీకి కావాల్సిన పెట్టుబడులపై సీఎం చంద్రబాబు చర్చిస్తున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ పయనిస్తోందని ఉద్ఘాటించారు సీఎం చంద్రబాబు. రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. ఏపీ రాజధాని అమరావతి కొత్త అవకాశాలకు, ఇన్నోవేషన్‌కు కేంద్రంగా ఉంటుందని వివరించారు. విశాఖపట్నంలో నవంబర్ 14, 15వ తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని ఈ సందర్భంగా వారిని సీఎం చంద్రబాబు ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ఏపీలో త్వరలో పర్యటిస్తామని, పెట్టుబడులపై ఆలోచన చేస్తామని పారిశ్రామిక ప్రతినిధులు చెప్పారు. అలాగే.. అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులతోనూ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. భారతదేశంలో తమ వ్యాపారాన్ని విస్తరించేందుకు ఆసక్తి చూపించారు ఏడీఎన్‌ఓసీ ప్రతినిధులు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంధన రంగంలో ఉన్న పెట్టుబడి అవకాశాలను వివరించారు సీఎం. దక్షిణాసియాకు చేరువగా సుదీర్ఘ తీర ప్రాంతం కలిగిన వ్యూహాత్మక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని తెలిపారు ముఖ్యమంత్రి. పెట్రో కెమికల్ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహించేందుకు అవకాశం ఉందని వివరించారు సీఎం.

అనంతరం అబుదాబీలోని పారిశ్రామిక వేత్తలతో నెట్‌వర్క్ లంచ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం పాల్గొన్నారు. నెట్‌వర్క్ లంచ్‌లో జీ 42 సీఈవో మనుకుమార్ జైన్, ఏడీఐసీ గ్లోబల్ హెడ్ లలిత్ అగర్వాల్, ఐహెచ్‌సీ సీఈవో అజయ్ భాటియా, డబ్ల్యూఐవో బ్యాంక్ సీఈవో జయేష్ పాటిల్, పాలిగాన్ మార్ఫిక్ సీఈవో జయంతి కనాని, ట్రక్కర్ సీఈవో గౌరవ్ బిశ్వాస్, పాలసీ బజార్ గ్రూప్ సీఈవో యశిష్ దహియా, ఇన్సూరెన్స్ మార్కెట్ సీఈవో అవినాష్, ఇన్నార్ట్ సీఈవో అజార్ ఇక్బాల్, జీఐఐ సీఈవో పంకజ్ గుప్తా, నూన్ సీఈవో ఫరాజ్ ఖలీద్, ఇన్సెప్షన్ సీఈవో ఆశీష్ కోషి, తదితరులు పాల్గొన్నారు.





**అల్పపీడన ప్రభావంతో ప్రకాశం జిల్లాలో రెండు రోజులుగా జోరు వానలు కురుస్తున్నాయి. ఒంగోలు పట్టణంలో కర్నూలు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ పరిసరాల్లో రోడ్లపైకి భారీగా వరద నీరు చేరింది. దీంతో వాహనదారులు, ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. మార్కాపురంలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పెద్ద నాగులవరం వెళ్లే దారిలో గుండ్లకమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. బోడపాడులో వర్షపు నీరు ఇళ్లలోకి చేరింది. పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లి ఎస్సీ కాలనీని వాన నీరు చుట్టు ముట్టింది.**

## మద్యం కల్తీ చేసినా.. తప్పుడు ప్రచారానికి పాల్పడినా కఠిన చర్యలు: మంత్రి కొల్లు రవీంద్ర

విశాఖపట్నం: మద్యం కల్తీ చేసినా.. తప్పుడు ప్రచారానికి పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. గాజువాకలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌తో కలిసి ఎక్సైజ్ సురక్ష యాప్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.

అనంతరం మద్యం షాపులో బాటిళ్లను స్కాన్ చేశారు. ఈ సందర్భంగా కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. "2014–19లోనే ట్రాక్ అండ్ ట్రేస్ తీసుకొచ్చాం. జగన్ అధికారంలోకి వచ్చాక వ్యవస్థలను నాశనం చేసి కల్తీ మద్యం విక్రయించారు. వైకాపానే మ ద్యం కల్తీ చేసి ప్రభుత్వంపై నెట్టే కుట్ర చేస్తున్నారు. 80 శాతం మద్యం అమ్మకాలు డిజిటల్ పేమెంట్ల ద్వారా జరగడం పారదర్శకతకు నిదర్శ నం. మద్య నిషేధం పేరుతో అధికారంలోకి వచ్చి కల్తీ మద్యం అమ్మిన జగన్‌కు ఈ అంశంపై మాట్లాడే అర్హత లేదు" అని కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు.




## సంతోష్ రావు హయాంలో రూ.40వేల కోట్ల అవినీతి: ఏబీ వెంకటేశ్వరరావు



తిరుపతి: ఏపీ ఎస్పీడీసీఎల్ మాజీ ఛైర్మన్ సంతోష్‌రావు హయాంలో భారీగా అవినీతి జరిగిందని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరావు ఆరోపించారు. తిరుపతిలోని ఏపీ ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీ శివశంకర్‌ను ఆయన కలిశారు. డిస్కంలో రూ.40వేల కోట్ల అవినీతి జరిగిందని.. విచారణ జరిపించాలని కోరారు. అనంతరం ఏబీ వెంకటేశ్వరరావు మీడియాతో మాట్లాడారు. "గత ప్రభుత్వ హయాంలో సంతోష్‌రావు ఇష్టానుసారంగా ప్రవర్తించారు. 2023లో రూ.కోట్లలో అవినీతి బయటపడింది. సామాన్య ప్రజల నుంచి డబ్బు వసూలు చేయడం సరికాదు. విద్యుత్ రంగంలో గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు. ప్రభుత్వం మారినా సంతోష్‌రావు కొనసాగారు. 12 సార్లు ఆర్టీఐ కింద సమాచారం అడిగినా ఇవ్వలేదు. ఆయన అవినీతిపై సంపూర్ణ ఆధారాలు సేకరించాం" అని ఏబీ వెంకటేశ్వరరావు అన్నారు.

## అలర్ట్‌గా ఉండండి.. ప్రజలు ఇబ్బంది పడొద్దు: మంత్రి నారాయణ

అమరావతి, అక్టోబర్ 23: రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మున్సిపల్ కమిషనర్లను మంత్రి నారాయణ అప్రమత్తం చేశారు. గురువారం నాడు మున్సిపల్ కమిషనర్లు, ఉన్నతాధికారులతో మంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వర్షాల వల్ల ప్రజలకు ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ , పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. తాగు నీరు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని మున్సిపాలిటీల్లో 24 గంటలు పనిచేసేలా కాల్ సెంటర్ అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్‌లను కూడా ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని ఆదేశించారు. అలాగే పోలీసు, వైద్యారోగ్య శాఖ సిబ్బందితో సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్లకు మంత్రి నారాయణ సూచనలు చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు. కాగా.. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం బలహీనపడింది. ఉత్తర తమిళనాడు, దక్షిణ అంతర్గత కర్ణాటక ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. ఇది రాబోయే 24 గంటల్లో



దక్షిణ అంతర్గత కర్ణాటక దిశగా కదులుతూ మరింత బలహీనపడే అవకాశం ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో విస్తృతంగా వర్షాలు పడనున్నాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.

దక్షిణ కోస్తా, రాయలసీమలో మోస్తరు వర్షాలు పడనుండగా.. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురవనున్నాయ్నారు. తీరం వెంబడి 30–50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న నిర్మాణాల్లో ఉండరాదని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రఖర్ జైన్ హెచ్చరికలు జారీ చేశారు.




## మత్స్యకారులను క్షేమంగా స్వస్థలాలకు తీసుకొస్తాం: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం: పొరపాటున బంగ్లాదేశ్ సముద్ర జలాల్లో ప్రవేశించి అక్కడి నేవీ అధికారులకు చిక్కిన విజయనగరం జిల్లా మత్స్యకారులను క్షేమంగా స్వస్థలాలకు చేరుస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఈ విషయంపై బుధవారం రాత్రి విదేశాంగ మంత్రి జైశంకర్‌తో చర్చించినట్లు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం తరఫున అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మత్స్యకారులను తిరిగి రప్పించేందుకు బంగ్లాదేశ్ ఎంబసీ, అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విజయనగరం జిల్లాకు చెందిన 8 మంది మత్స్యకారులు బుధవారం తెల్లవారుజామున బంగ్లాదేశ్ జలాల్లోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వారిని తిరిగి రప్పించేందుకు కేంద్రమంత్రి చర్యలు చేపట్టారు.




అమరావతి: కల్తీ మద్యం తయారీకి ఆద్యులు జగన్, వైకాపా నేతలేనని మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్ పేరుతో ఆఫ్రికాలో కల్తీ మద్యం వ్యాపారం నిజం కాదా అని ప్రశ్నించారు. "కల్తీ మద్యం తయారీ కంపెనీని కామెరూన్ ప్రభుత్వ మంత్రి సీజ్ చేసిన విషయం నిజం కాదా? వైఎస్ సునీల్‌రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి.. జగన్ బినామీలు కాదా? ప్రతాప్, కాకాణిని పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదో జగనే చెప్పాలి. జయచంద్రారెడ్డి, సురేంద్రనాయుడిని తెదేపా నుంచి సస్పెండ్ చేశాం. వారిపై కేసులు కూడా పెట్టాం.. కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమిదే" అని తెలిపారు.




నైరుతి బంగాళాఖాతంలో సుస్పష్ట అల్పపీడనం కొనసాగుతోంది. 12 గంటల్లో క్రమంగా బలహీనపడి అల్పపీడనంగా మారే అవకాశముంది. అండమాన్ సముద్ర తీరంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. 24 గంటల్లో రాష్ట్రంలో అతిభారీ వర్షాలు కురిసే అవకాశముంది. రాష్ట్ర వ్యాప్తంగా వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కర్నూలు జిల్లాలతో పాటు యానాంలో ఆకస్మిక వరదలు వచ్చే అవకాశముందని పేర్కొంది. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అల్పపీడన ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. నెల్లూరు జిల్లాలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పునరావాస కేంద్రాలు సిద్ధం చేసినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. అనంతసాగరం మండలం కమ్మవారిపల్లెలో చప్టాపై వరద ప్రవహిస్తోంది. ఈ జిల్లా వ్యాప్తంగా రెండో రోజూ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. కృష్ణపట్నం పోర్టులో మూడో నంబర్ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. లింగసముద్రంలో 8.3 సెం.మీ, ఉలవపాడులో 6.2 సెం.మీ, రాపూరులో 5.6 సెం.మీ, మర్రిపాడులో 5.3 సెం.మీ, ఉదయగిరిలో 4.7 సెం.మీ, అనంతసాగరం, కొండాపురంలో 4.6 సెం.మీ, కోవూరులో 4.1 సెం.మీ, కొడవలూరులో 4 సెం.మీ వర్షపాతం నమోదైంది. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షానికి పెన్నా నదిలో వరద ప్రవాహం పెరిగింది. నెల్లూరు జిల్లా చేజెర్ల మండలం యనమదల వద్ద నల్లవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మర్రిపాడు మండలం బొగ్గేరు, సైదాపురం మండలం పిన్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పొదలకూరు మండలంలో నావూరు, పెదవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గుడ్లూరు–తెట్టు మధ్య రాళ్ల వాగు ఉధృతితో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## ఏపీలో హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి సహకారం అందించండి: మంత్రి లోకేశ



అమరావతి: ఏపీలో హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి సహకారం అందించాలని ఏపీ మంత్రి నారా లోకేశ్ కోరారు. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయన.. విక్టోరియా టూరిజం, స్పోర్ట్స్ శాఖల మంత్రి స్టీవ్ డిమోపౌలోస్‌తో భేటీ అయ్యారు. క్రికెట్, హాకీలో ఉమ్మడి శిక్షణ శిబిరాలు, ఫ్రెండ్లీ మ్యాచ్‌లు నిర్వహించాలన్నారు. ఏపీలో పాపికొండలు, విశాఖ బీచ్ వంటి సుందర ప్రదేశాలు ఉన్నాయని వివరించారు. గ్రేట్ ఓషన్ రోడ్ తరహా పర్యావరణ బ్రాండింగ్‌కు విక్టోరియా నైపుణ్యాన్ని అందించాలని కోరారు. ఏపీలోని ఈవెంట్ మేనేజ్‌మెంట్ నిపుణులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

**టాస్మానియా యూనివర్సిటీ ప్రతినిధులతో భేటీ...** టాస్మానియా యూనివర్సిటీ ప్రతినిధులతో లోకేశ్ భేటీ అయ్యారు. ఫార్మసీ, పారామెడికల్ కోర్సుల్లో పాఠ్య ప్రణాళికల అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామీణ ఆరోగ్య సంరక్షణ, తాగునీటి సరఫరాపై ఉమ్మడి పరిశోధనలు చేపట్టాలన్నారు. ఫార్మసీ విద్యార్థుల స్కిల్ సర్టిఫికేషన్స్‌కు బెంచ్ మార్కు చేయాలని విజ్ఞప్తి చేశారు.

## బంగ్లాదేశ ప్రభుత్వానికి లేఖ.. మత్స్యకారులను స్వదేశానికి తీసుకొస్తాం: మంత్రి అచ్చెన్న

అమరావతి: మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. బంగ్లాదేశ్ నావికాదళం అదుపులో ఉన్న మత్స్యకారులను స్వదేశానికి తీసుకురావడానికి చర్యలు ప్రారంభించామని, అక్కడి ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాశామని తెలిపారు. విజయనగరం జిల్లాకు చెందిన 8 మంది మత్స్యకారులను వెనక్కి రప్పించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు.

విదేశాంగ మంత్రిత్వశాఖ ద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరుగుతున్నాయని వివరించారు. మత్స్యకార కుటుంబాలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీసి చర్యలు తీసుకోవాలని ఆదేశించారని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి మత్స్యకార కుటుంబానికి రక్షణ కవచంలా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



## సింగిల్ కాదు మంచి గర్ల్ ఫ్రెండ్ ను -రష్మిక

టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో గత కొన్ని రోజులుగా రూమర్డ్ జంటగా పేరు సొంతం చేసుకున్నారు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న. 'గీతాగోవిందం' సినిమాలో తొలిసారి కలిసి నటించిన ఈ జంట.. ఆ తర్వాత 'డియర్ కామ్రేడ్' సినిమా చేసి.. తమ పరిచయాన్ని కాస్త ప్రేమగా మార్చుకున్నట్లు సమాచారం. అప్పటినుంచి పలు వెకేషన్ లకి వెళ్లడం.. సినిమా పార్టీలకు హాజరవ్వడం.. పలు ప్రదేశాలలో తిరుగుతూ ఫోటోలకు ఫోజులిచ్చారు. కానీ ఎప్పుడూ కూడా తమ బంధాన్ని బయట పెట్టలేదు. ఇదిలా ఉండగా ఇటీవల విజయ్ దేవరకొండ – రష్మిక మందన్న రహస్యంగా నిశ్చితార్థం చేసుకున్నారు. కానీ ఈ విషయాన్ని కూడా అభిమానులతో పంచుకోలేదు. కానీ నిశ్చితార్థం తర్వాత విజయ్ దేవరకొండ పుట్టపర్తి సత్యసాయి మహా సమాధిని సందర్శించడానికి వెళ్ళినప్పుడు అక్కడి స్థానికులు ఆయనను గౌరవంగా ఆహ్వానించారు. ఆ సమయం లో కొన్ని ఫోటోలు బయటకు రాగా.. ఆయన చేతి వేలికి ఉన్న ఉంగరంతో నిశ్చితార్థ విషయం కాస్త నిజమయింది. అలాగే మొన్నామధ్య రష్మిక మందన్న షేర్ చేసిన కొన్ని ఫోటోల ద్వారా కూడా ఆమె చేతికి ఉన్న డైమండ్ ఉంగరం బయటపడింది. దీంతో వీళ్ళిద్దరూ నిశ్చితార్థం చేసుకున్నట్లు అటు



అభిమానులే కాదు సినీ సెలబ్రిటీలు కూడా నిర్ధారణకు వచ్చేశారు. ఇకపోతే ఈ జంట ఎప్పటికప్పుడు హింట్ ఇస్తున్నారే తప్ప తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించలేదు. ఇదిలా ఉండగా తాజాగా రష్మిక నటించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. నవంబర్ 7వ తేదీన విడుదల కాబోతున్న నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించి ప్రమోషనల్ కార్యక్రమాలను చేపట్టారు చిత్ర బృందం. అందులో భాగంగానే ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన రాహుల్ రవీంద్రన్, రష్మిక మందన్న లను రాహుల్ రవీంద్రన్ భార్య, ప్రముఖ సింగర్, డబ్బింగ్ ఆర్టిస్ట్ చిన్మయి ఇంటర్వ్యూ చేశారు. అందులో భాగంగానే రష్మికను మీరు సింగిలే కదా అని రాహుల్ అడగడంతో ఆమె ఇచ్చిన సమాధానం అందరికీ ఒక క్లారిటీ వచ్చేసింది. అసలు విషయంలోకి వెళ్తే.. ది గర్ల్ ఫ్రెండ్ ప్రమోషన్స్ లో భాగంగా రాహుల్ రవీంద్రన్ మాట్లాడుతూ.. "మీరు సింగిలే కదా అని రాహుల్ అడగగా.. మొదట సిగ్గు పడిపోయిన రష్మిక.. నవ్వుతూ నేను మంచి గర్ల్ ఫ్రెండ్ ని అంటూ చెప్పుకొచ్చింది. మొత్తానికైతే తాను సింగిల్ కాదని తాను కూడా రిలేషన్ లో ఉన్నానని ఈ విధంగా చెప్పేసింది రష్మిక. ఏది ఏమైనా రష్మిక.. విజయ్ దేవరకొండ రిలేషన్ ఇప్పుడు మళ్లీ వార్తల్లో నిలిచింది. ఇకపోతే ఈ జంట వచ్చే ఏడాది ఫిబ్రవరిలో వివాహం చేసుకోబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కనీసం ఆ రోజైనా ఈ జంట అధికారికంగా ప్రకటిస్తారో లేదో తెలియాల్సి ఉంది. రష్మిక విషయానికి వస్తే.. ఇటీవల ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వంలో మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా విడుదల చేసిన చిత్రం థామా.. ఈ చిత్రంలో బేతాళ పాత్రలో అదరగొట్టేసింది రష్మిక. అక్టోబర్ 21న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా.. మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పుడు ది గర్ల్ ఫ్రెండ్ సినిమా విడుదలకు సిద్ధం కాబోతోంది.

## ఆయన వల్ల నా లైఫ్ లో బిజీగా ఉన్నా

లైఫ్ లో ఎప్పుడేం జరుగుతుందో ఎవరూ చెప్పలేం. అందుకే లైఫ్ ఈజ్ అన్‌ప్రెడిక్టబుల్ అంటుంటారు. సినీ ఇండస్ట్రీలో ఆ ప్రిడిక్షన్ ఇంకా దారుణంగా ఉంటుంది. ఎవరెప్పుడు ఎలా మారిపోతారో ఎవ రూ చెప్పలేం. ఒక్క ఛాన్స్ కొందరి లైఫ్ ను వెనక్కి తిరిగి చూసుకునే పన్లేకుండా మార్చేస్తే, అదే ఛాన్స్ మరికొందరి లైఫ్ ను తలకిందులు చేస్తుంది.

**సీరియల్స్ నుంచి సినిమాల వరకు..** తన లైఫ్ కూడా అలా ఒక్క ఛాన్స్ తోనే మొత్తం మారిపోయిందని చెప్తున్నారు నటి హరితేజ. తెలుగు బుల్లితెర ప్రేక్షకులకు హరితేజ ఎవరో కొత్తగా పరిచయం చేయనక్కర్లేదు. పలు సీరియల్స్, టీవీ షోల్లో నటించిన హరి తేజ, బిగ్ బాస్ రియాలిటీ షో తో ప్రేక్షకులకు మరింత చేరువయ్యారు. బిగ్ బాస్1 ద్వారా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని పాపులరయ్యారు హరితేజ.



**అ..ఆలో పనిమనిషి పాత్రలో..** సీరియల్స్ తో పాటూ వంటల షో కు హోస్ట్ గా వ్యవహరించిన హరి తేజ ఇప్పుడు ఎక్కువగా సినిమాలపైనే ఫోకస్ చేశారు. ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్టుగా పలు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్న హరి తేజకు వరుస అవకాశాలు రావడానికి కారణం డైరెక్టర్ త్రివిక్రమేనని ఆమె చెప్తున్నారు. అ..ఆ సినిమాలో త్రివిక్రమ్ పని మనిషి క్యారెక్టర్ ఇవ్వడం వల్ల తన లైఫ్ మొత్తం మారిపోయిందని హరితేజ తెలిపారు.

**వారమైనా ఫోన్ రాలేదు...** త్రివిక్రమ్ పని మనిషి క్యారెక్టర్ కోసం వెతుకుతున్న టైమ్ లో ఓ రోజు టీవీ చూస్తున్నప్పుడు వంటల షోలో తనను చూసి, ఆ జోక్స్, కామెడీ విని ఈ అమ్మాయిని తీసుకురమ్మని తన టీమ్ కు చెప్పారని, తనకు ఫోన్ చేసి త్రివిక్రమ్ సినిమా అని చెప్పగానే షాకయ్యానని హరితేజ చెప్పారు. కానీ ఆ క్యారెక్టర్ కోసం ఆడిషన్ ఇచ్చాక తనకు ఏమీ చెప్పలేదని, వారం రోజులయ్యాక ఇక ఆఫర్ పోయినట్టేలే అనుకుంటున్న టైమ్ లో ఫోన్ చేసి డేట్స్ కావాలని అడిగారని, కనీసం కథేంటో కూడా అడక్కుండానే తాను ఆ సినిమాకు ఒప్పుకున్నట్టు హరితేజ చెప్పారు. అ..ఆ మూవీ చేసేటప్పుడే ఈ సినిమా తర్వాత తన లైఫ్ మారిపోతుందని చెప్పారని ఆమె పేర్కొన్నారు.




## మాస్ మహారాజా... మూడు నెలలు నిండకుండానే..!



మాస్ మహారాజా రవితేజ హీరోగా రూపొందిన 'మాస్ జాతర' సినిమా విడుదలకు సిద్ధం అయింది. అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న మాస్ జాతర సినిమా ప్రమోషన్ కార్యక్రమాలు మొదలు అయ్యాయి. ఇప్పటికే రికార్డ్ చేసి పెట్టిన ఇంటర్వ్యూలో ఒక్కటి ఒక్కటి చొప్పున విడుదల చేస్తున్నారు. శ్రీలీల హీరోయిన్‌గా నటించిన మాస్ జాతర సినిమాతో భాను భోగవరపు దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. ఇప్పటి వరకు విడుదలైన ప్రమోషన్ స్టఫ్ చూస్తే సినిమా ఖచ్చితంగా మంచి మాస్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని, యాక్షన్ సినిమాలను ఇష్టపడే ప్రేక్షకులను మెప్పిస్తుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం సినిమా చివరి దశ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటున్నట్లుగా సమాచారం అందుతోంది. ఇదే సమయంలో రవితేజ తదుపరి సినిమాపై ఆసక్తికర అప్డేట్ వచ్చింది.

**రవితేజ 75వ సినిమా మాస్ జాతర...** రవితేజ 75వ సినిమాగా మాస్ జాతర సినిమా రూపొందింది. అంతా మనదే అనేది ట్యాగ్ లైన్. ఆ సినిమా తర్వాత రవితేజ నటిస్తున్న సినిమా ఇప్పటికే ప్రారంభం అయింది. రవితేజతో మంచి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను కిషోర్ తిరుమల తీస్తున్నాడు. రవితేజ 76వ సినిమాగా రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించి ఇప్పటి వరకు అధికారికంగా టైటిల్‌ను ప్రకటించలేదు. కానీ సోషల్ మీడియాలో మాత్రం సినిమా గురించి రకరకాలుగా టైటిల్స్ ప్రచారం జరుగుతున్నాయి. మొత్తానికి రవితేజ 76వ సినిమాపై అంచనాలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం సినిమాకు సంబంధించిన షూటింగ్ స్పెయిన్‌లో జరుగుతున్నట్లు మేకర్స్ నుంచి క్లారిటీ వచ్చింది. సినిమా యొక్క షూటింగ్ కు సంబంధించిన విషయాలను హీరోయిన్ ఆషిక రంగనాథ్ సోషల్ మీడియా ద్వారా పంచుకోవడంతో అందరికీ క్లారిటీ వచ్చింది.

**2026 సంక్రాంతికి రవితేజ కొత్త సినిమా...** 2026 సంక్రాంతికి వస్తామని గతంలోనే ప్రకటించినప్పటికీ కొందరు అనుమానం వ్యక్తం చేశారు. మాస్ జాతర సినిమాను 2025 సంక్రాంతికి అన్నారు. కానీ సాధ్యం కాలేదు, ఇప్పుడు అలాగే రవితేజ, కిషోర్ తిరుమల సినిమా విడుదల తేదీ కూడా మారుతుందని, సంక్రాంతికి ఉన్న కాంపిటీషన్ కారణంగా సినిమాను వాయిదా వేయడం ఉత్తమం అనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. కానీ మేకర్స్ మాత్రం సినిమాను సంక్రాంతి 2026 కి విడుదల చేయాలని బలంగా ఫిక్స్ అయ్యారు. మరో సారి సినిమా విడుదల సంక్రాంతికి అన్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతానికి సినిమా యొక్క రెగ్యులర్ షూటింగ్ శరవేగం గా జరుగుతోంది. ఈ షెడ్యూల్ పూర్తి చేస్తే మరో కీలక షెడ్యూల్ చేయాల్సి ఉందని తెలుస్తోంది. ఈ సినిమా షూటింగ్ కి సంబంధించిన అధికారిక వివరాలు మరిన్ని త్వరలో వచ్చే అవకాశం ఉంది.

**మెగాస్టార్ చిరంజీవి సినిమాతో పాటు రవితేజ సినిమా...** అక్టోబర్ 31న మాస్ జాతర సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న రవితేజ కనీసం మూడు నెలలు కూడా పూర్తి కాకుండానే కిషోర్ తిరుమల దర్శకత్వంలో చేస్తున్న సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఇంత తక్కువ సమయంలో స్టార్ హీరోల సినిమాలు రావడం చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. రవితేజ మాస్ జాతర చాలా ఆలస్యం అవుతూ వచ్చింది. అందుకే తదుపరి సినిమా విషయంలో అస్సలు ఛాన్స్ తీసుకోవాలని భావించడం లేదని, అందుకే సంక్రాంతి 2026 కి పోటీ తీవ్రంగా ఉన్నప్పటికీ అదే సమయంలో రావాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. రవితేజ సంక్రాంతికి వస్తే చిరంజీవితో పాటు మరో రెండు సినిమాలతోనూ పోటీని ఎదుర్కోవాల్సి ఉంటుంది. పోటీ ఎంత ఉన్నా కంటెంట్ ఉంటే ఖచ్చితంగా బయట పడే అవకాశం ఉంటుంది. అందుకే రవితేజ ఆ నమ్మకంతో సంక్రాంతికి రావాలని భావిస్తూ ఉంటాడని తెలుస్తోంది.

## ది బ్లాక్ గోల్డ్: 'విరూపాక్ష' బ్యూటీ హై వోల్టేజ్ యాక్షన్ మోడ్



హీరోయిన్ అంటే కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం అనే రోజులు పోయాయి. కంటెంట్‌కు ప్రాధాన్యత ఉన్న పాత్రలతో, తమ నటనతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లే నటీమణులకు ఇప్పుడు మంచి డిమాండ్ ఉంది. అయితే, పూర్తిస్థాయి యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో, కథను మొత్తం తమ భుజాలపై మోసే లేడీ ఓరియెంటెడ్ చిత్రాలు మాత్రం మన దగ్గర చాలా అరుదుగా వస్తాయి. ఈ లోటును తీర్చడానికే అన్నట్లు, ఒక టాలెంటెడ్ బ్యూటీ ఇప్పుడు యాక్షన్ అవతారం ఎత్తింది. 'విరూపాక్ష', 'డెవిల్' వంటి చిత్రాలతో నటిగా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్న సంయుక్త, ఇప్పుడు తన కంఫర్ట్ జోన్‌ను దాటి, ఒక డేరింగ్ స్టెప్ వేసింది. ఆమె నెక్స్ట్ సినిమా ఫస్ట్ లుక్ చూస్తే ఎవరికైనా గూస్‌బంప్స్ రావడం ఖాయం. ఆమె నెక్స్ట్ లెవెల్ పర్ఫార్మెన్స్‌కు సిద్ధమవుతున్న చిత్రం 'ది బ్లాక్ గోల్డ్'. దీపావళి కానుకగా మేకర్స్ విడుదల చేసిన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో హైలెట్ అవుతోంది. చేతిలో గన్, ముఖంపై గాయాలు, ఒంటిపై రక్తపు మరకలతో, చుట్టూ శవాల మధ్య ఎంతో పవర్‌ఫుల్‌గా, ఇంటెన్స్‌గా నిలబడి ఉన్న సంయుక్త లుక్ అదిరిపోయింది. ఆమె కళ్లలో కనిపిస్తున్న కసి, సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతోందో చెప్పకనే చెబుతోంది. ఈ పోస్టర్‌ను దర్శకుడు యోగేష్ KMC చాలా స్టైలిష్‌గా ఫ్రేమ్ చేశారు. వెనుక రైల్వే స్టేషన్ బ్యాక్‌డ్రాప్, వస్తున్న ట్రైన్.. ఇవన్నీ చూస్తుంటే ఒక కొత్త యాక్షన్ స్టార్ ఇండియన్ స్క్రీన్‌పైకి అడుగుపెట్టబోతున్నారనే ఫీలింగ్‌ను కలిగిస్తోంది. 'ది బ్లాక్ గోల్డ్' అనే టైటిల్ కూడా చాలా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇది ఎలాంటి గురించిన కథ, సంయుక్త ఎవరిపై ఈ యుద్ధం చేస్తోంది? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ఈ చిత్రాన్ని నిర్మాత రాజేష్ దండ, సింధు మాగంటి భారీ బడ్జెట్‌తో, పాన్ ఇండియా స్థాయిలో నిర్మిస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్లకు తన బీజీఎంతో ప్రాణం పోసే సామ్ సి.ఎస్. ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటం మరో పెద్ద ప్లస్ పాయింట్. ఇది ఒక అడ్వెంచరస్, యాక్షన్ ప్యాక్డ్ చిత్రంగా, ప్రేక్షకులకు ఒక డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుందని చిత్రయూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. మొత్తం మీద, ఈ ఫస్ట్ లుక్ అయితే సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. గ్లామర్ రోల్స్‌తో పాటు, ఇలాంటి పవర్‌ఫుల్ పాత్రలను కూడా చేయగలనని సంయుక్త నిరూపించుకోవడానికి సిద్ధమైంది. మరి ఆమెకు ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి.

## రిస్క్ చేయాలని డిసైడైన జాన్వీ కపూర్

ఎవరికైనా సక్సెస్, ఫెయిల్యూర్లు సహజం. అయితే సక్సెస్ ఎవరికైనా కిక్కిస్తే ఫెయిల్యూర్ మాత్రం చాలా డిజప్పాయింట్ చేస్తుంది. అయితే కొందరు మాత్రం ఫెయిల్యూర్ ను దృష్టిలో పెట్టుకుని, మళ్లీ అలాంటివి రాకుండా జాగ్రత్త పడితే, ఇంకొందరు మాత్రం ఫెయిల్యూర్ వచ్చినంత మాత్రాన దిగులు పడుతూ కూర్చుంటే ఎలా అని కెరీర్లో ముందుకెళ్తూ ఉంటారు. జాన్వీ కపూర్ ఇందులో ఆఖరి కోవలోకి వస్తుంది. అతిలోక సుందరి శ్రీదేవి కూతురిగా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన జాన్వీ, తక్కువ టైమ్ లోనే తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్ గా జాన్వీ నుంచి వచ్చిన పరమ్ సుందరి, సన్నీ సంస్కారీ కీ తులసీ కుమారి సినిమాలు బాక్సాఫీస్ వద్ద అనుకున్న ఫలితాల్ని అందుకోలేకపోయాయి. అయినప్పటికీ జాన్వీ కృంగి పోలేదు.

**యాక్షన్ సినిమాకు ఓకే చెప్పిన జాన్వీ...** ఆ సినిమాలు ఫ్లాప్ అయినా జాన్వీ మాత్రం తర్వాతి సినిమాను లైన్ లో పెట్టి అందరికీ షాకిచ్చింది.




టైగర్ ష్రాఫ్, లక్ష్య ప్రధాన పాత్రల్లో కరణ్ జోహార్ నిర్మాణంలో ఓ కొత్త యాక్షన్ డ్రామాకు జాన్వీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే జాన్వీ ఈ సినిమా ఒప్పుకోవడానికి కారణం.. తాను కేవలం రొమాంటిక్ సినిమాలు మాత్రమే కాదు, ఏ జానర్ సినిమాలైనా చేయగలనని నిరూపించుకోవాలనుకోవడం. రాజ్ మెహతా దర్శకత్వంలో రానున్న ఈ సినిమా యాక్షన్, రివెంజ్, ఇంటెన్స్ డ్రామాతో రూపొందనుందని వార్తలు వినిపిస్తున్నాయి. అంతేకాదు, ఈ మూవీలో జాన్వీకి చాలా స్ట్రాంగ్ రోల్ దక్కిందని, ఈ సినిమా ద్వారా తన ఎనర్జీ, ఎమోషన్, స్క్రీన్ ప్రెజెన్స్ ను మరింత బలంగా చూపించే అవకాశముందని తెలుస్తోంది. ఇదిలా ఉంటే ఫ్యాన్స్ మాత్రం టైగర్ ష్రాఫ్, లక్ష్యతో జాన్వీ కెమిస్ట్రీ ఎలా ఉంటుందోనని డిస్కస్ చేసుకుంటున్నారు.

**ఛాలెంజింగ్ రోల్స్ పై ఫోకస్....** రెండు ఫ్లాపుల తర్వాత జాన్వీ ఇలాంటి అడుగు వేయడం అందరినీ ఆశ్చర్యపరుస్తుంది. ఇలాంటి సినిమాలు ఎంచుకుని, ఫ్లాపులు తన కెరీర్ ను డిసైడ్ చేయలేవని జాన్వీ నిరూపించుకోవాలని చూస్తుంది. అంతేకాదు, నటిగా కూడా తనను ఛాలెంజ్ చేసే సినిమాలను ఎంచుకోవాలని డిసైడై, అలాంటి క్యారెక్టర్లపైనే జాన్వీ ఫోకస్ చేసి రిస్క్ చేయడానికి కూడా జాన్వీ రెడీ అయిందని బాలీవుడ్ మీడియా వర్గాలంటున్నాయి. ఈ సినిమా సక్సెస్ అయితే ఇప్పటివరకు ఉన్న జాన్వీ క్రేజ్ మరో లెవెల్ కు వెళ్లడం ఖాయం. ఎవరైనా వరుస ఫ్లాపులు వచ్చినప్పుడు సేఫ్ ప్రాజెక్టులను సెలెక్ట్ చేసుకుని హిట్ అందుకోవాలని చూస్తారని, కానీ జాన్వీ మాత్రం భిన్నంగా ఆలోచించి తన సత్తా ఏంటో చాటాలని కసిగా ఉందని, ఏ నటికైనా ఇలాంటి లక్షణమే ఉండాలని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.

## దీపాల వెలుగుల్లో పూజిత!

ఏదైనా అకేషన్ వచ్చిందంటే చాలు సెలబ్రిటీలు చాలా అందంగా .. సాంప్రదాయంగా ముస్తాబయి ఆ ఫోటోలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు.. ఇక నిన్న మొన్నటి వరకు దేవీ నవరాత్రుల్లో భాగంగా అమ్మవారి గెటప్పుల్లో కనిపించి అందరినీ అబ్బురపరిచిన ఈ భామలు ఇప్పుడు దీపావళి స్పెషల్ అంటూ దీపావళి మొత్తం తమ కళ్ళల్లోనే ఉంది అన్నట్టు నిరూపిస్తున్నారు. ఈ క్రమంలోనే దీపావళి స్పెషల్ సందర్భంగా మరింత అందంగా ముస్తాబయి ఆ ఫోటోలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. ఈ క్రమంలోనే తాజాగా దీపావళి సెలబ్రేషన్స్ లో భాగంగా ప్రముఖ బ్యూటీ పూజిత పొన్నాడ కూడా ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలు షేర్ చేసింది. గ్రీన్ కలర్ చీర కట్టుకొని.. గోల్డెన్ కలర్ స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించి తన అందాలతో అందరినీ అబ్బురపరిచింది. ముఖ్యంగా నడుము అందాలు హైలైట్ చేస్తూ పూజిత పొన్నాడ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. సెల్ఫీలు దిగుతూ.. దీపావళి మొత్తం తన ఇంట్లోనే అన్నట్టుగా ఆ ఫోటోలను పంచుకుంది ఈ ముద్దుగుమ్మ. ప్రస్తుతం పూజిత పొన్నాడ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. వీటిని చూసిన ఫాలోవర్స్, నెటిజన్స్ హార్ట్, స్మైలీ ఎమోజీలతో కామెంట్ బాక్స్ నింపేస్తున్నారు. పూజిత పొన్నాడ



కెరియర్ విషయానికి వస్తే.. ఆంధ్రప్రదేశ్ విశాఖపట్నంలో జన్మించింది ఈ ముద్దుగుమ్మ. తండ్రి ఉద్యోగరీత్యా చెన్నై, ఢిల్లీ వంటి నగరాలలో పెరిగింది. ఇంజనీరింగ్ పూర్తి చేసిన పూజిత టాటా కన్సల్టెన్సీలో కొంతకాలం ఉద్యోగం కూడా చేసింది. సినిమాల మీద ఉన్న ఇష్టంతోనే ఉద్యోగాన్ని కూడా పక్కనపెట్టి సినిమా రంగం వైపు అడుగులు వేసింది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే మొదట మోడలింగ్ రంగంలోకి అడుగులు వేసిన పూజిత.. ఆ తర్వాత 2015లో ఉప్మా తినేసింది అనే షార్ట్ ఫిలిమ్స్ ద్వారా నటన రంగంలోకి అడుగు పెట్టింది. 2016 లో వచ్చిన బైలింగ్వల్ చిత్రం ఊపిరి సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది ఈ ముద్దుగుమ్మ. ఆ తర్వాత దర్శకుడు, రంగస్థలం, రాజుగాడు, బ్రాండ్ బాబు ఇలా చెప్పుకుంటూ పోతే దాదాపు చాలా చిత్రాలలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలు పోషించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలుగులోనే కాకుండా తమిళ్ భాషలలో కూడా అవకాశాలు అందుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. అందులో భాగంగానే గత ఏడాది తమిళ్ చిత్రాలలో నటించిన ఈమె.. ఈ ఏడాది పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా.. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో వచ్చిన హరిహర వీరమల్లు సినిమాలో నటించి తన అద్భుతమైన నటనతో ఆకట్టుకుంది. ఇప్పుడు మరో తెలుగు చిత్రంలో నటిస్తోంది. అలాగే ఒక తమిళ్ సినిమాలు కూడా అవకాశం లభించినట్లు సమాచారం. క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన పూజిత హీరోయిన్ గా అడుగులు వేసి సక్సెస్ అందుకోవాలని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.




హైదరాబాద్: మూసీ నదిపై మూసారాంబాగ్ వద్ద ఉన్న పాత వంతెనను జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. ఇటీవల మూసీ వరదలకు పాత వంతెన పూర్తిగా దెబ్బతిని రవాణాకు అనుకూలంగా లేకపోవడంతో గత కొన్ని రోజులుగా రాకపోకలు నిలిపివేశారు. వరద కారణంగా వంతెనకు క్రాక్స్ రావడం, రెయిలింగ్ పెచ్చులూడి పోవడం, అక్కడక్కడా ఇనుపరాడ్లు తేలి ప్రమాదకర స్థితిలో ఉండటంతో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు వంతెను పూర్తిగా పరిశీలించి మూసివేశారు. ట్రాఫిక్ పోలీసులు సైతం వంతెనపై రాకపోకలకు అనుమతులు నిలిపివేశారు. ఈ క్రమంలో ముందస్తుగా పాత వంతెనపై ఎలాంటి ప్రమాదాలు జరగకుండా పూర్తిగా కూల్చివేస్తున్నారు. పాత వంతెన స్థానంలో కొత్తగా మరో వంతెన నిర్మాణానికి జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. ప్రస్తుతం అంబర్ పేట వైపు వెళ్లే వాహనాలను గోల్నాక వంతెన మీదుగా దారి మళ్లించారు. పాత వంతెన కూల్చివేతతో కాలినడకన వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త వంతెన పూర్తి చేశాకే పాత వంతెన తొలగించాలని కోరుతున్నారు

## గుడ్ న్యూస్.. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం




హైదరాబాద్, అక్టోబరు23 : తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా 14 మంది సబ్ రిజిస్ట్రార్లని రేవంత్‌రెడ్డి సర్కార్ నియమించింది. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇందుకు సంబంధించిన విషయాలను మీడియాకు వెల్లడించారు. స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా నియమించిన అధికారులు బాధ్యతలు స్వీకరించారని తెలిపారు.

**కాంగ్రెస్ హయాంలోనే యువతకు ఉద్యోగాలు: మంత్రి పొంగులేటి...**

కాంగ్రెస్ హయాంలోనే యువతకు ఉద్యోగాలు వచ్చాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉద్ఘాటించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ప్రకటించారు. జీపీవోలు, ఇంజినీర్లు, సర్వేయర్ల నియమకాలతో ఉపాధి అవకాశాలని తమ ప్రభుత్వం విస్తరించిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ శాఖలో కొత్తగా 14 మంది సబ్ రిజిస్ట్రార్లని నియమించామని వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వంలో నిరుద్యోగుల కలలు కల్లలు అయిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చుతున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కేసీఆర్

ఎర్రవల్లి: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో గెలుపే లక్ష్యంగా భారత రాష్ట్ర సమితి నాయకులకు పార్టీ అధినేత కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో దాదాపు రెండున్నర గంటలకుపైగా పార్టీ సీనియర్ నేతలతో కేసీఆర్ సమావేశమయ్యారు. ఉప ఎన్నిక ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. "కాంగ్రెస్ బాకీ కార్డులను జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి పంచాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తెలంగాణ ఆగమైంది.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఆగమవుతున్న తెలంగాణను కాపాడుకోవాల్సిన అవసరముంది. ప్రజల్లో కాంగ్రెస్ వైఫల్యాలపై విస్తృతంగా చర్చ జరగాలి" అని కేసీఆర్ అన్నారు. సమావేశంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, జూబ్లీహిల్స్ అభ్యర్థి సునీత, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

## తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చడమే లక్ష్యం: మంత్రి శ్రీధర్‌బాబు



మెల్‌బోర్న్: తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా లైఫ్ సైన్సెస్ అత్యున్నత నిర్ణాయక సంస్థ 'ఆస్ బయోటెక్' నిర్వహించిన సదస్సులో శ్రీధర్‌బాబు కీలకోపన్యాసం చేశారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ సాధించిన పురోగతి, భవిష్యత్ ప్రణాళిక, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలను వివరించారు. "జీడీపీ లో తెలంగాణ వాటా 5శాతం, గత ఆర్థిక సంవత్సరంలో జాతీయ సగటు కంటే రాష్ట్ర జీఎస్‌డీపీ ఎక్కువ. ఏడాదిన్నరలో రూ. 3. 2లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. లైఫ్ సైన్సెస్ రంగాన్ని రాబోయే ఐదేళ్లలో 250 మిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యం. దీనికి సంబంధించి త్వరలో నూతన పాలసీ తీసుకు రాబోతున్నాం. గ్లోబల్ లైఫ్ సైన్సెస్ అట్లాస్‌లో భారత్ నుంచి హైదరాబాద్‌కు మాత్రమే స్థానం దక్కింది. బయో డిజిటల్ యుగానికి కావాల్సిన అత్యుత్తమ వనరులు అందించేలా యువతను తీర్చిదిద్దుతున్నాం" అని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

## గ్రూప్-1 నియామకాల్లో అక్రమాలపై విచారణ జరిపించాలి: కవిత




హైదరాబాద్ : తెలంగాణ గ్రూప్-1 నియామకాల్లో అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ జరిపించాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత లేఖ రాశారు. ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించి చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రూపు-1 నియామకాల్లో రాష్ట్రపతి ఉత్తర్వులను ఉల్లంఘించారని పేర్కొన్నారు. ప్రెసిడెన్షియల్ ఆర్డర్‌కు విరుద్ధంగా నియామకాలు చేపట్టినట్టు తనకు నిరుద్యోగులు ఫిర్యాదులు చేశారని పేర్కొన్నారు. నిరుద్యోగులు లేవనెత్తుతున్న అంశాలపై విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రూప్-1 పరీక్షల్లో ప్రిలిమ్స్‌కు ఒక హాల్ టికెట్ నంబర్, మెయిన్స్‌కి మరొక హాల్ టికెట్ నంబర్ ఇవ్వడం వల్ల విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని లేఖలో రాసుకొచ్చారు. గ్రూపు-1 పేపర్ల మూల్యాంకనంలో తమకు అన్యాయం జరిగిందని తెలుగు మీడియం అభ్యర్థులు తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. కాగా, హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో ఇటీవలే గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన 562 అభ్యర్థులకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేసిన సంగతి తెలిసిందే.







అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భారతీయుడు అరెస్టయ్యాడు. కాలిఫోర్నియాలో జరిగిన ఘటనలో ముగ్గురు మృతికి కారణమయ్యాడని పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా అగ్రరాజ్యంలోకి ప్రవేశించిన అతడి పేరు జషన్‌ప్రీత్ సింగ్ అని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. 21 ఏళ్ల సింగ్ ప్రమాద సమయంలో మాదకద్రవ్యాల మత్తులో జోగుతున్నాడని పేర్కొన్నాయి. 2022లో సింగ్ అమెరికాలోకి ప్రవేశించాడు. అప్పుడు కాలిఫోర్నియాలోని బోర్డర్ పెట్రోల్ ఏజెంట్లు అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణ పెండింగ్‌లో ఉండటంతో అతడిని విడుదల చేశారు. అతడి వద్ద చట్టబద్ధమైన ప్రతాలు లేవని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ తాజాగా ధ్రువీకరించింది (%×శ్రీశ్రీవస్త్రుశ్రీ ×అఎఖుఅ ×ఎఎఅస్త్రతీఖుత్ ఎతీబఎఎ ఐతీఱజవతీ%). కాలిఫోర్నియా ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. "ఆ ఘటనలో సింగ్ కూడా గాయపడ్డాడు. ట్రక్ నడుపుతోన్న సమయంలో అతడు డ్రగ్స్ మత్తులో ఉన్నాడని వైద్యులు వెల్లడించారు" అని హైవే పెట్రోలింగ్ అధికారి వెల్లడించారు. ట్రాఫిక్‌లో కూడా బ్రేక్స్ వేయలేదని ట్రక్ డ్యాష్‌క్యామ్ రికార్డింగ్‌ను బట్టి తెలుస్తోంది. ఇదిలాఉంటే.. ఆగస్టులోనూ ఇదే తరహా ఘటన జరిగింది. ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. 2018లో అక్రమంగా అగ్రదేశంలోకి ప్రవేశించిన హర్జిందర్ సింగ్ ఆ ఘటనకు కారకుడని తేలింది.




హైదరాబాద్: నగర శివారు పోచారం ఐటీ కారిడార్‌లో గోసంరక్షకుడు సోనూసింగ్‌పై కాల్పుల ఘటన నేపథ్యంలో భాజపా నేతలు ఆందోళనకు దిగారు. లక్డీకాపూల్‌లోని డీజీపీ కార్యాలయం ముట్టడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యాలయం వద్దకు వచ్చిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో పాటు పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. భాజపా నేతల ఆందోళనతో లక్డీకాపూల్, అసెంబ్లీ ప్రాంతాల్లో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. వాహనాల రాకపోకలను పోలీసులు క్రమబద్ధీకరించారు.




హైదరాబాద్: మంత్రుల మధ్య విభేదాలతో అధికారులు నలిగిపోతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. మంత్రుల ఒత్తిడికి తలొగ్గి తప్పులు చేస్తే ఆ తర్వాత మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. "తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కాదు.. మాఫియా రాజ్యం నడుస్తోంది. సీఎం ఇల్లు సెటిల్‌మెంట్‌లకు కేంద్రంగా మారిపోయింది. నీకింత, నాకింత అనే సెటిల్‌మెంట్లు తప్ప.. రాష్ట్రంలో పాలన లేదు. తుపాకీతో బెదిరించిన మాట వాస్తవమని మంత్రి కుమార్తె స్వయంగా చెప్పారు. బెదిరింపులు, టెండర్ల రిగ్గింగ్ ఇంత బహిరంగంగా దేశ చరిత్రలో ఏనాడూ జరగలేదు. అధికారులను వేధించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటు. మంత్రి వేధింపుల వల్లే ఐఏఎస్ అధికారి రిజ్వీ వీఆర్ఎస్ తీసుకున్నారు.

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తప్పుడు పనులు చేయాలని వేధిస్తున్నారు. అందుకే వారు వీఆర్ఎస్ తీసుకుంటున్నారు. మిగిలిన అధికారులు కూడా జాగ్రత్తగా ఉండాలి" అని కేటీఆర్ అన్నారు.

## ఈ ప్రభుత్వంలో మంత్రులే కొట్లాడుకుంటున్న పరిస్థితి: కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్: గోసంరక్షణ చేస్తున్న సోనూ సింగ్ అలియాస్ ప్రశాంత్ సింగ్‌పై కాల్పులు జరగడం బాధాకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. పోచారం కాల్పుల ఘటనలో గాయపడిన ఆయన్ను బండి సంజయ్ పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఓట్లు, డబ్బుల కోసమో ప్రశాంత్ సింగ్ ఇలా చేశారని చెప్పడం సరికాదని పేర్కొన్నారు. చేసిన వ్యాఖ్యలను పోలీసులు, సీఎం వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలోనూ గోవులు, గో రక్షకులకు రక్షణ లేదని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కూడా గోరక్షకుల పట్ల సరిగా లేదని చెప్పారు. ఈ ప్రభుత్వంలో మంత్రులే కొట్లాడుకుంటున్న పరిస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. సర్కార్ నిలబడుతుందా.. కుప్పకూలుతుందా తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయన్నారు.

**హైదరాబాద్: అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో నిన్న దిద్దుబాటుకు గురైన బంగారం, వెండి ధరలు గురువారం మళ్లీ పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల పసిడి ధర క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.2,600 పైనే పెరిగింది. నేటి మార్కెట్లో 24 క్యారెట్ల మేలిమి 10 గ్రాముల ధర రూ.1,28,300కు చేరింది. ఇక, 22 క్యారెట్ల ధర రూ.1,14,650గా ఉంది. అటు వెండి ధర కూడా దాదాపు రూ.3వేలకు పైనే పెరిగింది. నేటి మార్కెట్‌లో కేజీ వెండి ధర రూ.1,59,500 పలికింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు పుత్తడి ధర 4,121 డాలర్లుగా ఉంది. ఇక, ఔన్సు వెండి ధర 49.18 డాలర్లకు చేరింది. రికార్డు గరిష్ఠాలకు చేరిన ఈ లోహాల్లో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, భారత్ సహా వివిధ దేశాల సుంకాల విషయంలో అమెరికా దిగి వస్తోందనే సంకేతాలతో నిన్న బంగారం, వెండి ధరలు కాస్త దిగొచ్చాయి. అయితే, రాబోయే పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయంగా గిరాకీ ఉండటంతో వీటి ధరలు మళ్లీ పెరుగుతున్నాయి.**

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com